పారిశుద్ధ్య నిర్వహణ అందరి బాధ్యత: కలెక్టర్


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రజలకు రక్షిత తాగునీరు, పారిశుద్ధ్యం, ప్రభుత్వ సంస్థల నిర్వహణపై చేయాల్సిన బాధ్యత జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి అధికారుల వరకు ఉందని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన కలెక్టరేట్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం నిర్వహించిన అధికారుల సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించేలా మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలన్నారు. గ్రామాల్లో నాటిన మొక్కల ఆడిట్ నిర్వహించడం జరుగుతుందని నూటికి నూరు శాతం పని జరిగేలా అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ఆశా వర్కర్లు గ్రామాల్లో సక్రమంగా పని చేయాలని, జ్వరాలు వచ్చినప్పుడు తనిఖీ చేసి మందులు ఇవ్వడమే కాకుండా ప్రసవాలపై దృష్టి సారించాలన్నారు. గ్రామస్థాయి అధికారులు విధులకు గైర్హాజరైతే సహించేది లేదన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, నారాయణ అమిత్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పరిశీలించాలి: ఎస్పీ

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులు సత్వరమే పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన నెలవారీ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి కేసును విచారణ చేసేసమయాల్లో పూర్తి పారదర్శకంగా చేయాలని సూచించారు. కేసు నమోదు నుంచి ఛార్జిషీట్ వరకు ప్రతి విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోక్సో గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన విచారణ పూర్తి చేసి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయాలని తెలిపారు. సైబర్ క్రైమ్, డయల్ 100 వినియోగం పై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందు పరిచి పరిష్కారం అయ్యేలా చూస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాములు నాయక్, డీఎస్పీలు రమేశ్, శివరాం రెడ్డి, రాజశేఖర్‌రాజు, గిరిబాబు, సైదా, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల్లో కొలువు కళ

◆ వెల్లడైన ఫలితాలు,
◆ జిల్లాలో భర్తీ కానున్న 605 పోస్టులు
◆ నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన

నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: డీఎస్సీ- 2024 ఫలితాలు విడుదలయ్యాయి. ప్రభుత్వం జులై, ఆగస్టు నెలల్లో డీఎస్సీ పరీక్ష నిర్వహించి సోమవారం ఫలితాలు ప్రకటించింది. మొదటి సారి ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్ష ద్వారా ఉమ్మడి నల్గొండ జిల్లాలో 1268 పోస్టులు భర్తీ చేయనున్నారు. నల్గొండ జిల్లాలో 605, సూర్యాపేటలో 386, యాదాద్రి భువనగిరిలో 277 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కానున్నాయి. ప్రభుత్వం పరీక్ష నిర్వహించి తక్కువ సమయంలో ఫలితాలు వెలువరించడంపై అభ్యర్థుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. మధ్యాహ్నం ఫలితాలు ప్రకటించాక అధికారిక వెబ్ సైట్ సర్వర్ పని చేయకపోవడంతో అభ్యర్థులు కొంత ఇబ్బంది పడ్డారు. జిల్లాల వారీగా వివిధ సబ్జెక్టుల్లో ఖాళీలను 1:3 చొప్పున మంగళవారం నుంచి ధ్రువపత్రాల(సర్టిఫికెట్ల)ను పరిశీలించనున్నారు.

★ డీఎస్సీ- 2024 ఫలితాల్లో 1.3 ప్రకారం ఎంపిక అయిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని డీఈవో భిక్షపతి తెలిపారు. ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్థానిక డైట్ కళాశాలలో సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకోవాలని వివరించారు. అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటు రెండు జతల జీరాక్స్ కాపీలను పరిశీలన సమయంలో సమర్పించాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల మొబైల్, మెయిల్స్‌కు పంపిన సమాచారం ఆధారంగా సబెక్టుల వారీగా జాబితాలను పొందుపర్చినట్లు పేర్కొన్నారు.

5వ ర్యాంకు సాధించిన యాదగిరి



డీఎస్సీ 2024 ఫలితాల్లో నల్గొండ జిల్లాలోని శాలిగౌరారం మండలం ఆకారం గ్రామానికి చెందిన **వలిశెట్టి యాదగిరి** సోషల్ స్కూల్ అసిస్టెంట్‌లో 5వ ర్యాంకు సాధించారు. ఎంఈడీ పూర్తి చేసిన యాదగిరి పలు బీఈడీ, ఇతర కళాశాలల్లో అధ్యాపకులుగా పని చేశారు. పంచాయతీ కార్యదర్శి, సీఆర్‌పీ ఉద్యోగం వచ్చినప్పటికీ వెళ్లలేదు. తన లాంటి ఇబ్బందులు ఎవరు పడవద్దనే సంకల్పంతో డీఎస్సీలో ఉపాధ్యాయునిగా ఎంపికై విద్యార్థులను భావిపౌరులుగా తయారు చేయాలనే సంకల్పంతో ర్యాంకు సాధించినట్లు యాదగిరి తెలిపారు.

18ఏళ్ల బోధనానుభవంతో..



చిట్యాల,న్యూస్‌టుడే: హిందీబోధకుడిగా 18ఏళ్లపాటు చిట్యాల, చౌటుప్పల్, కట్టంగూరు మండలాల్లోని వివిధ ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేసిన అనుభవం తనకు సోమవారం ప్రకటించిన డీఎస్సీ-2024 ఫలితాల్లో జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు సాధించినట్లు చిట్యాలకు చెందిన **ఎండీ కలీమొద్దీన్** పేర్కొన్నారు. డీఎస్సీ పరీక్ష ప్రశ్నావళి చాలా క్లిష్టంగా ఉన్నందున ఫలితాల్లో తనకు జిల్లా స్థాయి ర్యాంకు వస్తుందని తాను ముందు ఊహించలేదని తెలిపారు. గతంలో మూడుసార్లు కొద్దిలో చేజారిపోయిందని, పట్టువదలకుండా చేసిన నాలుగో ప్రయత్నంలో జిల్లార్యాంకుతో ఉద్యోగానికి ఎంపిక కావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల రీత్యా డీఎస్సీ కోసం ప్రత్యేకంగా శిక్షణకు వెళ్లలేదని, రోజుకు 8గంటలపాటు సొంతంగానే సన్నద్ధం అయ్యానని తెలిపారు. తనబోధన ద్వారా విద్యార్థుల్లో హిందీభాష పట్ల ఆసక్తిని కలిగించడానికి కృషి చేస్తానన్నారు.

ఆ నిబంధనతో ఆగిపోయి.. ఇప్పుడు సఫలీకృతుడయ్యి!



త్రిపురారం: డీఎస్సీ ఫలితాల్లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా మండల కేంద్రానికి చెందిన **హనుమంతు అనిల్** రెండో ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు గీత వృత్తి చేస్తూ తనను చదివించారని.. కృష్ణా జిల్లా అవనిగడ్డలో రెండేళ్లు శిక్షణ పొంది జూలై 18న కోదాడలో డీఎస్సీ పరీక్ష రాసినట్లు చెప్పారు. 2023లో విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఇంటర్‌లో 50 శాతం మార్కులు ఉంటేనే అర్హులనే నిబంధన కారణంగా ఆగిపోయానన్నాడు. దీన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టుకు వెళ్లి అక్కడి నుంచి తీర్పు తెచ్చుకుని దరఖాస్తు చేసుకుని జిల్లాలో మొత్తం ఉన్న ఆరు పోస్టుల్లో రెండో ర్యాంకు సాధించినట్లు తెలిపారు.

అకుంఠిత కృషితోనే..



హాలియా: హాలియా పురపాలిక అలీనగర్‌కు చెందిన **ఎం.విజయేంద్రచారి** డీఎస్సీ ఫలితాల్లో జిల్లా స్థాయిలో 79.30 మార్కులతో నాలుగో ర్యాంకు సాధించారు. 2013-2014లో నాగార్జున సాగర్‌లో బీఈడీ పూర్తి చేసిన ఈయన నాడు బీఈడీ ఫలితాలలో ఉమ్మడి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర స్థానంలో మొదటి ర్యాంకు సాధించారు. 2017 డీఎస్సీలో స్వల్ప మార్కులతో ఉద్యోగం కోల్పోయినా.. 2019లో పంచాయతీ కార్యదర్శిగా ఎంపికై ప్రస్తుతం నిడమనూరు మండలం గుంటిపల్లి గ్రామపంచాయతీలో విధులు నిర్వహిస్తున్నాని తెలిపారు. నాటి నుంచి ఉద్యోగం చేస్తూ పోటీ పరీక్షలకు ప్రయత్నం సాధిస్తూ వస్తున్నానని.. కుటుంబ సభ్యుల సహకారం అకుంఠిత కృషి నేటి ఫలితాల్లో మంచి ర్యాంకు రావడం ఆనందంగా ఉందన్నారు.

తొలి ప్రయత్నంలోనే



మునుగోడు, న్యూస్‌టుడే: మునుగోడు మండలానికి కేంద్రానికి చెందిన **పల్లె భవాని** ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో జీవశాస్త్ర విభాగంలో 81.30 మార్కులతో జిల్లా మొదటి ర్యాంకు సాధించింది. ఈమె 2023లో బీఈడీ పూర్తి చేసింది. ఆ తర్వాత ఎమ్ఈడీ (మాస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో) రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు సాధించింది. 2024లో రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయగా తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించి సత్తా చాటింది. తన భర్త వేముల విష్ణు పూర్తి సహకారంతోనే ఇది సాధ్యమైందని ఆమె తెలిపారు.

ఒడిసిపట్టాలంటే.. విడిచిపెట్టే..!


నీలగిరి పుర కార్యాలయంలో నిర్మించిన ఇంకుడుగుంత

నల్గొండ పురపాలిక, సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే: ఉమ్మడి నల్గొండ జిల్లాలో పట్టణాలు శరవేగంగా విస్తరిస్తున్నాయి. భవన నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఎక్కడ చూసినా సిమెంటు రోడ్లు దర్శనమిస్తున్నాయి. జలసంరక్షణ మాత్రం ఎండమావిగానే మారుతోంది. నీటిబొట్టును ఒడిసిపట్టి భూమిలో ఇంకిపోయేలా చేసే చర్యలు తగ్గిపోతున్నాయి. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పిస్తున్నా, ప్రోత్సాహకాలు అందిస్తున్నా ప్రజల్లో మార్పు కనిపించడం లేదు. ఉమ్మడి జిల్లాలోని పురపాలికల్లో 2,36,550 గృహాలుండగా ఇప్పటి వరకు పది వేల ఇళ్లలోనే ఇంకుడుగుంతలు నిర్మించారు. దీంతో వాన నీరు వృథాగా పోతోంది.

తాజాగా ఆదేశాలు..

పట్టణాల్లో భూగర్భజలం తక్కువగా ఉన్నట్లు కేంద్ర జలశక్తిశాఖ విడుదల చేసిన నివేదిక ద్వారా స్పష్టమవుతోంది. ఏటా కురుస్తున్న వర్షాలకు జల వనరులు నిండకపోగా. సహజసిద్ధంగా ఏర్పడిన వనరుల్లోనూ జలం పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ తరుణంలో వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెంచాలని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ శ్రీకారం చుట్టింది. పట్టణాల్లో 300 చ.గజాల పైబడి ఉన్న స్థలాల్లో, అన్ని నిర్మాణాల్లో విధిగా ఇంకుడు గుంతలు తవ్వించాలని ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ప్రభుత్వ విభాగాల్లో, ప్రైవేటు వాణిజ్య భవనాల సముదాయాల్లో వీటిని ఏర్పాటు చేయాలని సూచించారు. ఇంకుడు గుంతలు తవ్వించకపోయినా, అవి పాడైపోయినా మున్సిపల్ అధికారులే బాధ్యత వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నిబంధనలు ఇలా..

నిబంధనల ప్రకారం ఇంకుడుగుంత నిర్మాణానికి భవన నిర్మాణదారులు రూ.2,500 నుంచి రూ.నాలుగు వేల వరకు డిపాజిట్ చెల్లిస్తేనే ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి అనుమతి ఇస్తుంది. తవ్విన ఇంకుడుగుంతను పట్టణ ప్రణాళిక అధికారులు పరిశీలించి నిర్మాణం సవ్యంగా ఉంటేనే ముందుగా చెల్లించిన డబ్బులు తిరిగి యజమానికి చెల్లించే వెసులుబాటు ఉంది.

అటకెక్కిందిలా..

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 19 పురపాలికల్లో ఈ ఏడాది సుమారు 4500 భవన నిర్మాణాలు ప్రభుత్వ అనుమతితో చేపట్టారు. అందులో ఒకటి రెండు శాతం మినహా నిర్మాణదారులు గుంతలు తవ్వించలేదు. భవన నిర్మాణాల అనుమతి పొందే సమయంలో ఉన్న ధ్యాస తర్వాత ఉండటం లేదు. ఇంకుడు గుంతలు తవ్వి ఒక్కరు కూడా డిపాజిట్ వెనక్కి తీసుకున్నవారు లేరు. 2020 నుంచి ఉమ్మడి జిల్లాలో మొత్తం రూ.2.13 కోట్ల నిధులు మూలుగుతున్నాయి.

పురపాలికల వారీగా వివరాలు

	సూర్యాపేట	నల్గొండ	యాదాద్రి
పురపాలికలు	5	8	6
నివాసాలు	82,340	92,420	61,790
డిపాజిట్లు(రూ.లక్షలు)	74	91	43

ఇంకుడు గుంతల ఏర్పాటుపై ప్రత్యేక చర్యలు

–ముసాబ్ అహ్మద్ సయ్యద్, కమిషనర్, నల్గొండ పురపాలిక

పట్టణంలో నీటి వృథాను నివారించి వాటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. కొత్తగా భవన నిర్మాణాలు చేపట్టే వారు విధిగా ఇంకుడు గుంతలు తవ్వి వాన నీటిని ఒడిసిపట్టుకునే విధంగా చర్యలు తీసుకుంటాం.

ఏకేబీఆర్ ఎగువకు కృష్ణమ్మ అడుగులు


పీఏపల్లి సమీపంలో కొనసాగుతున్న పంపుహౌస్ పనులు

పెద్దఅడిశర్లపల్లి, న్యూస్‌టుడే:

జిల్లా ఆశలసౌధం ఏఎమ్మార్ ప్రాజెక్టు అక్కంపల్లి జలాశయం ఎగువ రైతుల సాగునీటి కష్టాలు త్వరలో తీరనున్నాయి. అక్కంపల్లి ప్రాజెక్టు ఎగువన దేవరకొండ నియోజకవర్గం పీఏపల్లి, నాగార్జునసాగర్ నియోజకవర్గం గుర్రంపోడు మండలాల్లో 6691 ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు అడుగులు వేగంగా పడుతున్నాయి.

❒ 2021లో నాగార్జునసాగర్ ఉపఎన్నికల హామీల్లో భాగంగా అప్పటి ప్రభుత్వం దేవరకొండ నియోజకవర్గంలో పొగిళ్ల, కంభాలపల్లి, అంబాభవాని పెద్దమునిగల్, పెద్దగట్టు, ఏకేబీఆర్ ఎత్తిపోతల పథకాలు చేపట్టేందుకు రూ.585 కోట్లతో అనుమతులు జారీ చేసింది. వీటిలో ఒక్కటైన ఏకేబీఆర్ పనులు రూ.90.96 కోట్లతో వేగంగా సాగుతున్నాయి. 2022లో ప్రారంభమైన పనులు ఒప్పందం మేరకు 18 నెలల్లోనే పూర్తికావాల్సి ఉన్నా.. డ్రాయింగ్‌ల అనుమతులు, భూసేకరణలో జాప్యంతో ఆగుతూ సాగుతూ వచ్చాయి.

❒ కొద్దిరోజులుగా పథకంలో ప్రధానమైన పంపుహౌస్ పైపులైన్ల ఏర్పాటు పనులు వడివడిగా సాగుతున్నాయి. నీటిపారుదల శాఖ అధికారులు ఇటీవల ఇందుకు అవసరమైన మోటార్లు, ప్రధాన పైపులను ప్రాజెక్టు వద్దకు తరలిస్తున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి ఆయకట్టుకు నీటిని సరఫరా చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

❒ ఏఎమ్మార్ ప్రాజెక్టులో భాగమైన అక్కంపల్లి జలాశయంలో 245 ఎఫ్ఆర్ఎల్ వరకు 1.5 టీఎంసీల నీరు నిల్వచేయవచ్చు. ప్రాజెక్టు ఎగువన పీఏపల్లి పాత గ్రామంలో పంపుహౌస్ నిర్మాణం చేపడుతున్నారు. ఈ పంపుహౌస్‌లో 0.35 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 16 క్యూసెక్కుల నీటిని విడుదల చేసే 5 మోటార్లను అమర్చుతున్నారు.


నీటిని ఎత్తిపోసేందుకు తరలిస్తున్న ప్రధాన పైపులు

❒ ఏకేబీఆర్ పనులకు భూసేకరణే ప్రధాన సమస్యగా మారింది. పైపులైన్ల ఏర్పాటుకు 6.4 ఎకరాల భూసేకరణ చేపట్టాల్సి ఉంది. ప్రాథమిక సర్వే, పేపర్ నోటిఫికేషన్ పూర్తయినా.. రైతులకు చెల్లించాల్సిన నష్ట పరిహారంపై రైతులతో అంగీకారం కుదరకపోవడంతో జాప్యమవుతోంది. సంబంధిత అధికారులు గతంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో వారి నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

త్వరితగతిన పూర్తికి చర్యలు:



నాగయ్య, డీఈ నీటిపారుదలశాఖ

ఏకేబీఆర్ ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తికి చర్యలు చేపడుతున్నాం. పంపుహౌస్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మోటార్లు వచ్చాయి. పైపులైన్‌కోసం పైపులు తరలిస్తున్నాం. భూసేకరణ త్వరగా పూర్తయితే అనుకున్న సమయంలో ప్రాజెక్టు పూర్తి చేసి ఆయకట్టుకు నీరందిస్తాం.

వైద్యపరికరాల టెండర్లలో గోల్‌మాల్

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రిలో ఇంప్లాట్స్ (ఎముకల్లో అమర్చే పరికరాలు) సరఫరా చేసే గుత్తేదారుల ఎంపికలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. నిబంధన ప్రకారం ఆసుపత్రికి 15 కి.మీ దూరంలో సరఫరా చేసే సంస్థ ఉన్నవారు మాత్రమే టెండర్లలో పాల్గొనాల్సి ఉంటుంది. కానీ.. హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థకు అవకాశం కల్పించడంతో పాటు టెండర్ దక్కేలా జనరల్ ఆసుపత్రిలో పనిచేసే కింది స్థాయి అధికారి ఒకరు పావులు కదిపినట్లు తెలుస్తోంది. స్థానికంగా సరఫరా చేసే కార్యాలయం ఉండి జీఎస్టీ, డ్రగ్, ట్రేడ్ లైసెన్సులు ఉండాలని నిబంధనల్లో ఉన్నప్పటికీ వాటిని తుంగలో తొక్కిన సదరు సంస్థ నిర్వాహకులు రాత్రికి రాత్రే స్థానికంగా కార్యాలయం ఏర్పాటు చేసినట్లు పత్రాలు సృష్టించి అధికారులను పక్కదారి పట్టించినట్లు సమాచారం. 'గుత్తేదారు ఎంపిక సరైంది కాదని న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని'ని పలువురు గుత్తేదారులు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.అరుణకుమారిని వివరణ కోరగా నిబంధనల మేరకు కలెక్టర్ ఆదేశాలతో ఏర్పాటు చేసిన కమిటీ ద్వారా గుత్తేదారు ఎంపిక చేస్తున్నామని. . ఏమైనా అనుమానాలు ఉంటే అదనపు కలెక్టర్‌ను సంప్రదించొచ్చని పేర్కొన్నారు.


లో లెవల్ వంతెన కష్టాలు ఇంకెన్నాళ్లు..!


అమ్మనబోలు నుంచి నకిరేకల్‌కు వెళ్లే మార్గం ఇలా..

నార్కట్‌పల్లి గ్రామీణం న్యూస్‌టుడే: అమ్మనబోలు-నకిరేకల్ మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులకు లోలెవల్ వంతెన కష్టాలు తప్పడం లేదు. వర్షాకాలంలో నీళ్లు చేరడంతో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆ గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

నిత్యం రద్దీ.. అమ్మనబోలు నుంచి రామానుజపురం, ఎడమలబాయి, లొడంగిబాయి, బెండల్‌పహాడ్, భైరోనిబండ, శాలిగౌరారం, నకిరేకల్ మధ్య వాహనాలు నిత్యం తిరుగుతుండటంతో రద్దీగా ఉంటుంది ఈ మార్గం. ఈ దారిలోని వాగుపై గతంలో నిర్మించిన లోలెవల్ వంతెన ఉంది. నాటి పరిస్థితులకు ఆ వంతెన సరిపోయింది. కానీ. కాలక్రమేణా వంతెన పూర్తిగా లోలెవల్ కావటంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో నిత్యం కురుస్తున్న వర్షాలకు వరద నీరు ఉద్ధృతంగా వెళ్తుండగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. దీనికి తోడు వంతెనపై వరద వెళ్లిన ప్రతిసారి ఆ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గతంలో ఎప్పుడూ లేనివిధంగా వంతెన పైనుంచి భారీగా వరద వెళ్లడంతో కలెక్టర్, ఎస్పీలు పలు మార్లు సందర్శించారు.

వంతెన నిర్మించాలి:



జాన్‌రెడ్డి, అమ్మనబోలు

అమ్మనబోలు-నకిరేకల్ మధ్య రాకపోకలు సాగించే సుమారు ఏడు గ్రామాల ప్రజలు లోలెవల్ వంతెన కారణంగా వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు కురిసిన సమయంలో రాకపోకలు సాగించలేకపోతున్నాము. తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలి.

సమస్య పరిష్కారానికి చర్యలు:

సంతోశ్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

అమ్మనబోలు నుంచి నకిరేకల్‌కు రాకపోకలు సాగించడానికి వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ.4.5 కోట్లు నిధులతో హైలెవల్ వంతెన నిర్మించడానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

దసరాకు 448 ప్రత్యేక బస్సులు

◆ నేటి నుంచి ఈ నెల 16 వరకు పండగ సర్వీసులు


మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్

మిర్యాలగూడ పట్టణం, నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: బతుకమ్మ, దసరా పండగల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఆర్టీసీ సమాయత్తమైంది. ఈ నెల 1 నుంచి 11 వరకు (3, 4, 8 తేదీలు మినహా) 448 బస్సులు, తిరుగు ప్రయాణంలో ఈ నెల 13 నుంచి 16 వరకు 191 ప్రత్యేక బస్సులు నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రత్యేక బస్సులన్నీ ఉమ్మడి జిల్లాలోని డిపో కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు నడిపేందుకు సిద్ధమయ్యారు. మహాలక్ష్మి పథకంతో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరగగా.. దసరా రద్దీని తట్టుకునేందుకు ఆర్టీసీ అన్ని రకాల చర్యలు చేపట్టింది.

11న అత్యధికంగా సర్వీసులు

ప్రత్యేక ప్రణాళికలో భాగంగా ఈ నెల 11న అత్యధికంగా 125 బస్సులు నడుపనున్నారు. ఈ బస్సులు నల్గొండ, నార్కట్‌పల్లి, మిర్యాలగూడ, కోదాడ, సూర్యాపేట డిపోల నుంచి హైదరాబాద్ వరకు, దేవరకొండ డిపో నుంచి ఐఎస్ సదన్ వరకు, యాదగిరిగుట్ట డిపో నుంచి ఉప్పల్ క్రాస్‌రోడ్డు వరకు నడవనున్నాయి. వీటితో పాటు ఆయా డిపోల నుంచి నిత్యం తిరిగే 516 సర్వీసులు యథావిధిగా నడవనున్నాయి.

ఉమ్మడి జిల్లాలో డిపోల వారీగా ప్రత్యేక బస్సుల వివరాలు..

ప్రత్యేక బస్సులు	డిపో	తిరుగు ప్రయాణంలో
74	నల్గొండ	30
37	నార్కట్‌పల్లి	12
84	మిర్యాలగూడ	34
45	కోదాడ	14
87	సూర్యాపేట	37
62	దేవరకొండ	32
59	యాదగిరిగుట్ట	32

ప్రత్యేక బస్సుల వివరాలు తెలుసుకునేందుకు సంప్రదించాల్సిన నంబర్లు..

డిపో	ఫోన్ నంబర్
మిర్యాలగూడ	08689-241111
నల్గొండ	86822 93622
సూర్యాపేట	73829 43819
సూర్యాపేట (హైటెక్ బస్టాండ్)	94949 26625
కోదాడ	99592 26302
నార్కట్‌పల్లి	98485 84198
దేవరకొండ	94905 10752
యాదగిరిగుట్ట	73828 36087

రద్దీకి అనుగుణంగా..



–రాజశేఖర్, ఆర్ఎం, నల్గొండ

దసరా, బతుకమ్మ పండగల సందర్భంగా మొత్తం 639 ప్రత్యేక బస్సులు నడిపేందుకు సన్నద్ధమయ్యాం. ప్రయాణికుల రద్దీని బట్టి మరిన్ని అదనపు సర్వీసులు సైతం నడిపేందుకు సన్నద్ధంగా ఉన్నాం. ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఎల్బీనగర్, హయత్‌నగర్ వంటి రద్దీ ప్రదేశాల్లో ప్రత్యేక సిబ్బందిని నియమించనున్నాం.

రైతేరాజు 8లో..

రైతేరాజు

పంటల మార్పిడి.. లాభాల జడి

చింతపల్లి, న్యూస్‌టుడే: ప్రతిసారి ఒకే రకమైన పంటను సాగు చేయటంతో దిగుబడులు తగ్గి అన్నదాత నష్టాలను చవిచూస్తున్నాడు. రోజురోజుకు భూగర్భ జలం అడుగంటుతున్న తరుణంలో.. మారుతున్న కాలానికి అనుగుణంగా కొందరు రైతులు పంట మార్పిడి పద్ధతిని అనుసరిస్తూ లాభాల బాటలో పయనిస్తున్నారు. చింతపల్లి మండల కేంద్రానికి చెందిన ఓ యువ రైతు కూరగాయలు పండిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు గడిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

★ వరి, పత్తి పంటలకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. చింతపల్లి గ్రామానికి చెందిన శివర్ల రమేష్‌కు గ్రామంలో మూడెకరాల భూమి ఉంది. గతంలో పత్తి సాగు చేస్తూ వచ్చారు. పెట్టుబడి అధికమవటం.. దిగుబడి తక్కువ రావటం.. కూలీల కొరత కారణంగా ఏటా నష్టాలు వచ్చాయి. నష్టాల నుంచి గట్టెందుకు ప్రత్యామ్నాయంగా కూరగాయల సాగు వైపు మొగ్గు చూపాడు.





చింతపల్లిలో దొండతోటను సాగు చేస్తున్న శివర్ల రమేష్



కూరగాయల పంటలు

రూ.15 వేల పెట్టుబడితో..

రమేశ్ గతేడాది తన కున్న మూడెకరాల వ్యవసాయ భూమిలో దొండ, వంకాయ, టమాట, బెండ తోటను సాగు చేశారు. ప్రతి పంటకు రూ.15 వేల పెట్టుబడి పెట్టి సాగు చేయగా.. దిగుబడి సకాలంలో అందటంతో చింతపల్లి, హైదరాబాద్ మార్కెట్లకు తెల్లవారుజామున ఆటోలో తీసుకెళ్లి విక్రయించడంతో లాభాలొచ్చాయి. ఒక్క పంట మీద సుమారు రూ.50 వేలకు పైగా లాభం వచ్చింది. ప్రస్తుతం బెండ, బీర, పచ్చిమిర్చి, సొరకాయ పంటలను వేశారు.

రూ. 4 లక్షలతో పందిరి

ఎకరంలో రూ.4 లక్షల వ్యయంతో డ్రిప్, రాతి కడీలను ఏర్పాటు చేసి.. దొండ తోటలను క్రమం తప్పకుండా సాగు చేస్తున్నారు. ఈ పందిరి సుమారు 20 ఏళ్ల వరకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఉన్న భూమితోపాటు సమీప బంధువులకు చెందిన మరో ఐదు ఎకరాలకుపైగా పత్తి పంటలను సాగు చేస్తే పెట్టుబడులు సైతం రాకపోవడంతో సొంత ఆలోచనతో కూరగాయాల సాగు చేస్తున్నాను. మొదట్లో కూరగాయల సాగు చేయడంతో పెట్టుబడి కంటే అధిక దిగుబడులు రావడంతో మూడు సంవత్సరాలుగా పంటలు సాగు చేయడంతో సుమారు రూ.2లక్షల వరకు ఆదాయం వచ్చింది.

బొప్పాయిలో తెగుళ్ల నివారణ

గరిడేపల్లి, న్యూస్‌టుడే: బొప్పాయిలో పలు తెగుళ్లు ఆశించి తోటలో మొక్కలకు తీవ్ర నష్టం కల్గిస్తున్నాయని వెంటనే సరైన సస్యరక్షణ చేపట్టాలని ఉద్యాన విభాగం శాస్త్రవేత్త సీహెచ్. నరేష్ సూచించారు.



వేరుకుళ్లు సోకిన బొప్పాయి

కాండం కుళ్లు వ్యాధి సోకితే వేర్ల మొదలు మెత్తగా మారి కుళ్లిపోతాయి. నివారణకు మొక్క ప్రారంభ భాగంలో నీరు నిల్వఉండకుండా చూడాలి. బోర్డో మిశ్రమం 1 శాతం పూయాలి. లేదా కాపర్‌సల్ఫేట్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు మొక్కల మొదలు తడపాలి. బూడిద తెగులు ఆశిస్తే ఆకులు కాడలు కొత్త చిగుళ్లపైన తెల్లటి బూడిదలాంటి శిలీంధ్రపు పెరుగుదల కన్పిస్తుంది. నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లేదా కెరాథీన్ 1 మి.లీ. లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పత్తిలో సూక్ష్మధాతు లోపాలు

త్రిపురారం, న్యూస్‌టుడే: పత్తిలో సూక్ష్మధాతు లోపాలు, సవరణ గురించి కంపసాగర్ కేవీకే పీసీ శ్రీనివాసరావు తెలియజేశారు. మెగ్నీషియం లోప లక్షణాలు ముదురు ఆకులు, అంచుల నుంచి మధ్య భాగానికి పసుపు రంగుకు మారతాయి. ఆకుల ఈనెలు మాత్రం ఆకుపచ్చగా ఉంటాయి. ఆకులు ఎర్రబారి ఎండిపోయి రాలి పోతాయి. ఈ లోపం పొటాషియం ఎక్కువగా ఉన్న నెలల్లో సాధారణంగా కనిపిస్తుంది. మెగ్నీషియం లోప నివారణకు లీటరు నీటికి 10 గ్రా. మెగ్నీషియం సల్ఫేట్ పైరు వేసిన 45, 75 రోజుల తరువాత రెండు సార్లు పిచికారీ చేయాలి.

జింకు: పత్తిలో జింకు ధాతువు లోపం వల్ల ఆకుల ఈనెలు పచ్చగా ఉండి ఈనెల మధ్య భాగం మాత్రమే పసుపు పచ్చగా మారుతుంది. నివారణకు 20 కిలోల జింకు సల్ఫేట్‌ను దుక్కిలో వేసుకోవాలి, 0.2 శాతం జింకు సల్ఫేట్ ద్రావణాన్ని 2 గ్రా. లీటరు నీటికి పిచికారీ చేయాలి.

బోరాన్: పత్తిలో బోరాన్ లోపమున్నప్పుడు పూల స్వరూపం మారి ఆకర్షణ పత్రాలు చిన్నవై లోపలకు ముడుచుకుపోతాయి. ఆకులు కాడలు ఒకే రీతిన ఉండక కొంత దళసరిగాను, కొంత పలుచగాను ఉండి అక్కడక్కడ రింగుల మచ్చలు ఏర్పడతాయి. బోరాన్ లోప నివారణకు పైరు వేసిన 60, 90 రోజుల తరువాత లీటరు నీటికి 1.5 గ్రా. బోరాక్స్ వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

సమస్య - సమాధానం

? వరిలో సుడిదోమ గురించి తెలపండి.

- నరసింహారావు, అనుముల

సమాధానం: నీటి పైభాగంలో మొక్కల మొదళ్ల దగ్గర దోమలు కనిపిస్తాయి. పిల్ల, పెద్ద పురుగులు రసాన్ని పీల్చటం వల్ల పైరు సుడులతో ఎండిపోవటం, తాలు గింజలు ఏర్పడటం జరుగుతుంది. నివారణకు క్లోరిపైరిఫాస్, ప్రొఫెనోఫాస్, లామ్డా సైహలోత్రిన్ పిచికారీ చేసుకోవాలి. పొలంలో నీటిని తగ్గించి మొక్కల మొదళ్లపై పిచికారీ చేయాలి.

? కందిలో ఎండు తెగుళ్ల లక్షణాలు, నివారణ గురించి తెలపండి.

- రమణారెడ్డి, పెద్దదేవులపల్లి

సమాధానం: తెగులు సోకిన మొక్కలు పూర్తిగా లేదా కొంతభాగం వాడి ఎండిపోతాయి. వాటిని పీకి కాండం మొదలు భాగం చీల్చి పరిశీలిస్తే గోధుమ వర్ణపు నిలువు చారలు కనిపిస్తాయి. తెగులు అధికంగా కనిపించిన పొలాల్లో పొగాకు లేక జొన్నతో పంట మార్పిడి చేయాలి. నివారణకు మందులు లేవు. నీరు నిల్వ ఉండే భూముల్లో సాగు చేయకూడదు.

? బంతి పంటలలో నత్తల, నివారణ గురించి తెలపండి.

- అనంతుల వెంకటేష్, ఎర్రపాడ్

సమాధానం: నత్తలను సేకరించి సాధారణ ఉప్పు ఉన్న బకెట్‌లో ఉంచండి. నత్తలు రాత్రి సమయాల్లో చురుకుగా ఉంటాయి. వాటిని సేకరించడం ప్రధాన సమస్య. ఇంటి తోటల్లో సాధారణ ఉప్పుతో భౌతిక అవరోధం ఉంచండి. నివారణకు మెటల్డిహైడ్ 2.5 శాతం, డీపీ ఎసఎన్‌కిల్ 2.5 శాతం బైట్ ఎకరానికి 2 కిలోల చొప్పున ఉపయోగించాలి. మొక్కల దగ్గర చిన్న పరిమాణంలో నత్త పురుగుల ఎరలను 100 చదరపు అడుగుల విస్తీర్ణంలో దాదాపు 50, 80 గ్రా. ఉంచాలి.


- త్రిపురారం, న్యూస్‌టుడే

రైతులు వాట్సప్ ద్వారా అడిగే సమస్యలకు, సందేహాలకు కంపసాగర్ కేవీకే ఉద్యాన విభాగం శాస్త్రవేత్త శ్రీనివాసరావు సమాధానాలు ఇస్తారు. ఫోన్ నంబర్: 77025 44771



కంపసాగర్ కేవీకే పీసీ శ్రీనివాసరావు

శాకాహారం, మాంసాహారానికి ఇస్తున్న ప్రాధాన్యంపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన సర్వే వివరాలు..



సాత్వికాహారం.. దీర్ఘాయుష్షుకు మార్గం



శాకాహారంపై పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ(పాత చిత్రం)

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: 'ఆరోగ్యమే మహాభాగ్యం' అంటారు. కానీ, ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రజలు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదు. గతంలో ఎప్పుడో పండగలు, శుభాకార్యాలకు మాత్రమే తినే మాంసాహారం ప్రస్తుతం రోజువారీ భోజనంలో భాగమైంది. సాత్వికాహారమైన శాకాహారం ప్రాముఖ్యాన్ని వివరించేందుకు ఏటా అక్టోబరు ఒకటో తేదీన 'ప్రపంచ శాకాహార దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

వివిధ ఆహార పదార్థాలలో పోషకాల వివరాలు(వంద గ్రాముల పరిమాణంలో)

పదార్థం	ప్రొటీన్లు	పిండి పదార్థాలు	కేలరీలు
మేక మాంసం	21.4	-	118
చేపలు	76	9.0	413
కోడి మాంసం	24	-	132
కోడి గుడ్డు	6	1	73
సోయాబీన్స్	52	33	349
వేరుసెనగలు	19	61	374
బాదంపప్పు	20.8	10.5	655
గేదెపాలు	4.3	5.0	117
పెరుగు	3	4	55

సోయాబీన్స్(3.7), వేరుసెనగలు(3.1), బాదం పప్పు(1.7) మాత్రమే పీచు పదార్థాలు ఉంటాయి

❖ నేడు 'ప్రపంచ శాకాహార దినోత్సవం'

ధార్మిక సంస్థల సేవలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 37 లక్షలకు పైగా జనాభా ఉండగా.. వీరిలో 80 శాతం మంది ఏదో ఒక సందర్భంలో మాంసాహారం తిని ఉంటారని అంచనా. కరోనా కాలంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మాంసాహారం తినే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం శాకాహారానికి మారుతున్న వారి సంఖ్య పెరుగుతోందని నిపుణులు చెబుతున్నారు. శాకాహారం ప్రాధాన్యంపై అవగాహన కల్పించేందుకు పిరమిడ్ ధ్యాన కేంద్రం, శ్రీ రామ చంద్ర మిషన్, బ్రహ్మకుమారీస్ వంటి సంస్థలు ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.



శరీరం తేలికగా ఉంది: పల్‌రెడ్డి కృష్ణారెడ్డి, మిర్యాలగూడ

అనారోగ్యం కారణంగా 2020లో మాంసాహారం తినడం తాత్కాలికంగా మానేశాను. శాకాహారం తినడం వల్ల మనసు, శరీరం తేలికగా ఉన్నట్లు అనిపించడంతో ఇంతవరకు గుడ్డు కూడా ముట్టుకోలేదు. నిత్యం పప్పులు, ఆకుకూరలు, అన్ని రకాల కూరగాయలు తినడం వల్ల ప్రస్తుతం నా వయసు 50 ఏళ్లు దాటినా ఆరోగ్యంగా ఉన్నాను.

శరీరతత్వాన్ని బట్టి ఆహారం

–వేజెండ్ల జాహ్నవి, న్యూట్రిషనిస్ట్, మిర్యాలగూడ

మాంసాహారం కంటే శాకాహారమే మేలని నిపుణులు చెబుతున్నప్పటికీ శరీరతత్వాన్ని బట్టి ఒక్కొక్కరికి ఒక్కో ఆహారాన్ని సిఫారసు చేస్తుంటాం. మాంసాహారంలో అత్యధిక ప్రొటీన్ ఉండడం వల్ల.. అది అవసరమయ్యే వారికి మాంసాహారం తీసుకోవాలని చెబుతాం. శాకాహారంలోనూ ప్రొటీన్లు లభించే పదార్థాలు ఉన్నాయి. వీటిలో సోయా, వేరుసెనగలు వంటివి ఉన్నాయి. మాంసాహారులతో పోలిస్తే గుండెజబ్బులు, గుండెపోటు వల్ల వచ్చే మరణాలు శాకాహారుల్లో తక్కువగానే నమోదవుతున్నాయి.



గేదెల బీమా పత్రానికి లంచం వసూలు

నగదు తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన పశువైద్యాధికారి

చింతపల్లి, న్యూస్‌టుడే: రాయితీ రుణం తీసుకొని గేదెల ఫాం పెట్టుకోవడానికి అవసరమైన ఆరోగ్య, బీమా ధ్రువీకరణ పత్రాల కోసం రైతుల నుంచి లంచం వసూలు చేసిన మండల పశువైద్యాధికారి ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఈ ఘటన నల్గొండ జిల్లా చింతపల్లి మండలంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితులు, అధికారులు తెలిసిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా నసర్లపల్లి గ్రామానికి చెందిన రాసిక వినోద్, రాసిక కుమార్ అనే ఇద్దరు రైతులు పీఎంఈజీపీ పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో రాయితీపై రూ.20లక్షల రుణం తీసుకొని ఎనిమిది గేదెలను కొనుగోలు చేశారు.



జోసెఫ్ పాల్

మొదటి విడతగా రూ.10లక్షల రుణం మంజూరు చేశారు. రెండో విడత రుణం కావాలంటే పశువైద్యాధికారుల నుంచి గేదెలకు బీమా, ఆరోగ్య ధ్రువపత్రం తీసుకురావాలని బ్యాంకు అధికారులు సూచించారు. దీంతో వీరిద్దరూ మండల పశువైద్యాధికారి జోసెఫ్ పాల్‌ను సంప్రదించారు. గేదెలకు విలువ, బీమా, ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలంటే ఆయన రూ.20వేల లంచం అడిగాడు. అంత మొత్తం ఇవ్వలేమని పలుమార్లు వైద్యాధికారిని వేడుకున్న స్పందన లేదు. దీంతో చేసేదేమీ లేక రూ.8 వేలు ఇస్తామని చెప్పి, సోమవారం డబ్బులు ఇచ్చే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారు. తర్వాత ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో జోసెఫ్ పాల్‌కి రూ.6వేల లంచం ఇస్తుండగా అప్పటికే నిఘా పెట్టిన ఏసీబీ అధికారులు అతన్ని పట్టుకొని కస్టడీలోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకొని నాంపల్లిలోని ఏసీబీ కోర్టుకు తరలించనున్నట్లు ఏసీబీ డీఎస్పీ జగదీశ్ చంద్ర తెలిపారు. పాల్ ఇంటిపై దాడులు కొనసాగిస్తామని తెలిపారు. ఎవరైనా లంచం అడిగితే టోల్‌ఫ్రీ నెంబరు 1064 సమాచారం అందించాలని కోరారు. ఇన్‌స్పెక్టర్ రామారావు, వెంకట్‌రావు, సిబ్బంది ఉన్నారు.

▶ వృద్ధులకు ఆర్థిక భద్రత, ఆరోగ్య రక్షణ, నివాస వసతి ప్రధానమైనవి. వీటిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం-2007 అమలులోకి తెచ్చింది. ట్రైబ్యునల్ ఛైర్మన్‌గా ఆర్డీవోలు నియమితులయ్యారు. వారు వృద్ధుల నుంచి దరఖాస్తులు స్వీకరించి విచారణ నిర్వహించి పోషణ కోసం తీర్పులు వెలువరిస్తున్నారు.

▶ వృద్ధుల కోసం జాతీయ స్థాయిలో 'హెల్ప్‌లైన్' ను ప్రకటించారు. టోల్‌ఫ్రీ నెంబరు: 14567

ప్రశాంతంగా శేషజీవితం గడపాలని...

నేడు ప్రపంచ వృద్ధుల దినోత్సవం

చౌటుప్పల్, న్యూస్‌టుడే: దిక్కూమొక్కూ లేనివారు వృద్ధాప్యంలో శేషజీవితాన్ని ప్రశాంతంగా గడిపేందుకు యాదాద్రి భువనగిరి జిల్లా పెద్దకొండూరులో వానప్రస్థాశ్రమాన్ని నిర్మించారు మేరెడ్డి సత్యనారాయణరెడ్డి, జానకమ్మ దంపతులు. ఎకరం విస్తీర్ణంలో ఇరవై గదులతో ప్రశాంతమైన వాతావరణంలో కోటి రూపాయలు తమ సొంత డబ్బు వెచ్చించి వారు ఈ ఆశ్రమం కట్టారు. నిరాశ్రయులైన వృద్ధులకు ఉచితంగా ఆశ్రయం కల్పించి నిర్వహించే ఒప్పందంతో ఈ వానప్రస్థాశ్రమాన్ని, ఎకరం భూమిని రెడ్‌క్రాస్ సంస్థకు స్వాధీనం చేస్తూ రాష్ట్ర గవర్నర్ పేరిట దానపత్రాన్ని వారు అందజేశారు. రెడ్‌క్రాస్ సౌజన్యంతో హైదరాబాద్‌కు చెందిన 'సాయి యాదాద్రి సేవా ఆశ్రమం' ఆధ్వర్యంలో 2020 నుంచి నిర్వహిస్తున్నారు. ఇందులో యాభై మంది వృద్ధులు ఆశ్రయం పొందుతున్నారు. వారికి నాణ్యమైన భోజనం, వస్త్రాలు, ఈ ఆశ్రమంలో నిర్వహిస్తున్న గోశాలలోని ఆవు పాలు, పెరుగును ఆశ్రమవాసులకు అందిస్తున్నారు. మానసిక ప్రశాంతత కోసం సాయంత్రం భజన, సత్సంగం నిర్వహిస్తున్నారు. ఉదయం ధ్యానం, యోగా సాధన చేయిస్తారు. గ్రంథాలయం ఏర్పాటు చేశారు. వంద మంది వృద్ధులకు సరిపడేంత వసతి పెంచేందుకు ప్రభుత్వం ద్వారా మంజూరు చేసిన రూ.50లక్షలు, దాతల విరాళాలతో వసతిగృహం నిర్మిస్తున్నారు. 'దాతల నుంచి ఇప్పటి వరకు రూ.1.25 కోట్ల విరాళాలు సమకూరాయని, ఆ నిధులతో నాలుగేళ్లుగా వానప్రస్థాశ్రమాన్ని సేవాభావంతో నిర్వహిస్తున్నామ'ని సాయియాదాద్రి సేవాశ్రమం అధ్యక్షుడు దెబ్బటి అశోక్, కార్యదర్శి కేపై శెట్టి తెలిపారు.



చౌటుప్పల్ మండలం పెద్దకొండూరులో మేరెడ్డి సత్యనారాయణరెడ్డి, జానకమ్మలు నిర్మించిన వానప్రస్థాశ్రమం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వలస కూలీల దుర్మరణం

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం శివారులో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశాకు చెందిన ఇద్దరు వలస కూలీలు మృతి చెందారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం మయూర్‌బంజ్ ప్రాంతానికి చెందిన రాజు కిశోర్ సింగ్(39), బాసొతా బాగుడి(21), ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన మనిష్ కుమార్‌వర్మలు గత కొంత కాలం నుంచి దండుమల్కాపురం గ్రామ శివారులోని క్రషర్‌లో పని చేస్తున్నారు. క్రషర్ సమీపంలో క్వార్టర్స్‌లోనే నివాసం ఉంటారు. వీరు తీవ్రమైన జ్వరంతో బాధపడుతుండటంతో దండుమల్కాపురం గ్రామంలోని ఆర్ఎంపీ వద్దకు వెళ్లారు. అక్కడ ఆయన లేకపోవడంతో చౌటుప్పల్ ఆసుపత్రికి వస్తుండగా.. ఐవోసీఎల్ టెర్మినల్ ఎదురుగా వీరి ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజు కిశోర్ సింగ్, బాసొతా బాగుడి మృతి చెందారు. మనిష్ కుమార్ వర్మ తీవ్రంగా గాయపడటంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. మృతదేహాలకు చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రిలో సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్సై యాదవరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న 13 గ్రానైట్ లారీల పట్టివేత

కోదాడ న్యూస్‌టుడే: అక్రమంగా గ్రానైట్ రాయిని తరలిస్తున్న వాహనాలను మైనింగ్ అధికారులు పట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మైనింగ్ అధికారుల కథనం ప్రకారం.. అనంతగిరి మండలం బొజ్జగూడెం పరిధిలో కోదాడ మండలంలోని చిమిర్యాల మిడ్‌వెస్ట్ కంపెనీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా 13 లారీల్లో గ్రానైట్ రాయిని ఖమ్మం జిల్లాకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో మైనింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో మొదటగా 6 లారీలు పట్టుకోగా, తర్వాత మరో 7 లారీలను అదుపులోకి తీసుకున్నారు. చలానాలు చెల్లించేవరకు సీజ్ అయిన వాహనాలను కోదాడ పట్టణ పరిధిలో భద్రపరిచారు. అనుమతి లేకుండా గ్రానైట్‌ను తరలిస్తుండగా గ్రానైట్‌ను సీజ్ చేసి రూ.15 లక్షలకు పైగా జరిమానా విధించామని మైనింగ్ జిల్లా అసిస్టెంట్ జియాలజిస్ట్ విజయరామరాజు తెలిపారు. అధిక లోడుతో వెళ్తున్నందున వాహనాలను సీజ్ చేశామని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ గిలాని తెలిపారు. కార్యక్రమంలో మైనింగ్ సిబ్బంది రామ్మూరి, వెంకన్న, శ్రీనివాస్, తదితరులు తెలిపారు.



పట్టుకున్న గ్రానైట్ లారీలు

స్నేహితుడి కారు కోసం వెళ్లి.. కానరాని లోకాలకు

కోదాడ, వేములపల్లి, చిలుకూరు, న్యూస్‌టుడే: స్నేహితుడికి కారు కొనాలని మరో ఇద్దరు స్నేహితులు తోడుగా వెళ్లి తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తిరిగిరాని లోకాలకు వెళ్లిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా త్రిపురారం మండలం గుంటిపల్లి అన్నారానికి చెందిన మల్లికంటి దినేశ్(22) అనే వ్యక్తి మాడ్గులపల్లి మండలం ఆగామోత్కూర్ గ్రామంలో బేకరీ దుకాణం నడుపుతున్నాడు. దసరా పండగకు ఆఫర్లు ఉంటాయని నూతన కారు కొనేందుకు తన స్నేహితులైన వేములపల్లి మండలం మొలకపట్నం గ్రామానికి చెందిన వలపుదాసు వంశీ(22), మాడ్గులపల్లి మండలం ఆగమోత్కూర్ గ్రామానికి చెందిన అభిరాళ్ల శ్రీకాంత్(21) అనే ఇద్దరు స్నేహితులను తీసుకొని సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణానికి వచ్చాడు. కారు కొనేందుకు ఓ షోరూంనకు వెళ్లి ముందస్తుగా కొంత డబ్బులు చెల్లించి, అనంతరం స్వగ్రామాలకు ముగ్గురు స్నేహితులు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా చిలుకూరు మండలం మిట్స్ కళాశాల సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న కారు, లారీ మధ్యలో నుంచి వెళ్లడంతో లారీని ఢీకొట్టారు. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. ఘటన స్థలాన్ని కోదాడ గ్రామీణ సీఐ రజితారెడ్డి పరిశీలించారు. మృతదేహాలను కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు పోలీసులు తరలించారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేస్తున్నట్లు చిలుకూరు ఎస్సై రాంబాబుగౌడ్ తెలిపారు.



వలపుదాసు వంశీ



మల్లికంటి దినేశ్



శ్రీకాంత్

2 నెలల వ్యవధిలోనే తండ్రీ కుమారుల మృతి..

తండ్రి రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబానికి ఉండే బాధ మాటల్లో వర్ణించలేం. అలాంటి కుటుంబంలో తండ్రి మరణించినట్లుగానే ఏకైక కుమారుడు కూడా రోడ్డు ప్రమాదంలో మరణిస్తే అలాంటి ఘటనను ఊహించుకుంటేనే భయమేస్తుంది. కానీ అలాంటి ఘటనే త్రిపురారం మండలం గుంటిపల్లి అన్నారానికి చెందిన మల్లికంటి దినేశ్ కుటుంబానిది. 2 నెలల వ్యవధిలోనే భర్త శ్రీనివాస్, కుమారుడిని కోల్పోయిన ఆ తల్లి(పార్వతమ్మ) శోకం తీరనిది. దీంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

చికెన్ ధరలు

ఫాంరేటు	110–00
రిటైల్	132–00
డ్రెస్డ్	191–00
స్కిన్‌లెస్	218–00

ప్రాణదాతలు

☛ నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం

వైద్యులు వ్యతిరేకించినా పట్టువీడలేదు

–పులిజాల శ్రీదేవి, నల్గొండ

హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తాను. రెండేళ్ల క్రితం నా భర్తకు అనారోగ్యం కారణంగా రక్తం అవసరం కాగా.. నేను ఇచ్చేందుకు ముందుకు వచ్చాను. మహిళ నన్న కారణంతో నా నుంచి రక్తం సేకరించేందుకు వైద్యులు నిరాకరించారు, అయినా పట్టువీడకపోవడంతో ఒప్పుకున్నారు. అలా తొలి సారిగా రక్తదానం చేశాను. నాది బీ పాజిటివ్. ఇప్పటి వరకు 11 సార్లు రక్తదానం చేశాను.



మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

రక్తదానం ప్రాణదానంతో సమానం అంటారు. అత్యవసర సమయంలో స్పందించి రక్తదానం చేయడంతో ప్రాణాలు దక్కించుకున్న వారు అనేక మంది ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో సరిపడా రక్తనిల్వ కేంద్రాలు లేకపోవడంతో బాధితులకు ఒక్కోసారి సకాలంలో రక్తం అందని పరిస్థితులు నెలకొంటున్నాయి. పలువురు యువత ముందుకొచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయడంతో పాటు తమ స్నేహితుల ద్వారా దానం చేయిస్తూ ఆపత్కాలంలో ఆదుకుంటున్నారు. ఇటీవల మహిళలు సైతం ముందుకువస్తున్నారు. నేడు 'జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం' సందర్భంగా 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం...

రక్త నిల్వ కేంద్రాలు కరవు..

నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లా ఆసుపత్రులతో పాటు మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండలోని ప్రభుత్వ దవాఖానాల్లో రక్తనిల్వ కేంద్రాలు ఉన్నాయి. నల్గొండలో మూడు, మిర్యాలగూడలో రెండు, సూర్యాపేటలో ఒకటి, నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రిలో ఒకటి చొప్పున ప్రైవేట్ ఆధ్వర్యంలోని రక్త నిల్వ కేంద్రాలు ఉన్నాయి. నల్గొండ జిల్లా పరిధిలో 60 మంది తలసీమియా, సికిల్‌సెల్ బాధితులు ఉన్నారు. వీరికి అవసరాన్ని బట్టి ఒక్కొక్కరికి నెలకు ఒకటి నుంచి ఐదు యూనిట్ల రక్తం అవసరం. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో రక్తనిల్వ కేంద్రాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

21 సార్లు రక్తదానం చేశాను:

–కస్తూరి సురేష్, ఇంటీరియర్ డిజైనర్, కోదాడ

నాది ఏబీ పాజిటివ్ గ్రూపు రక్తం. రక్తం లేక ప్రాణాలు కోల్పోతున్నారనే వార్తలు చూసి చలించి.. 2016లో తొలిసారి రక్తదానం చేశాను. ఇప్పటి వరకు మొత్తం 21 సార్లు రక్తదానం చేశాను. దీని కోసం మెగా బ్లడ్ డొనేషన్ ట్రస్టు పేరుతో సంస్థను, వాట్సప్ గ్రూపులను ఏర్పాటు చేశాను. దీని ద్వారా సుమారు రెండు వేల మందికి పైగా రక్తదానం చేయించాను. రెండేళ్ల క్రితం ఓ చిన్నారికి అత్యవసర సమయంలో విజయవాడ వెళ్లి రక్తదానం చేయగా.. ఆ కుటుంబ సభ్యులు దేవుడిలా చూడటం మరచిపోలేని అనుభూతి. జనయేత్రి ఫౌండేషన్ మిర్యాలగూడ, సిరి రక్తనిల్వ కేంద్రం, ఖమ్మం నుంచి అవార్డులు సైతం అందుకున్నాను.



పోరాటాలతోనే ప్రజాసమస్యలు పరిష్కారం: సీపీఎం

శాలిగౌరారం, న్యూస్‌టుడే: ప్రజలతో కలిసి పోరాటాలు నిర్వహించినప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల అన్నారు. మండలంలోని బండమీది గూడెంలో మండల కార్యదర్శి చలకాని మల్లయ్య ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మహాసభలో పాల్గొని మాట్లాడారు. నిరుపేదల జీవితాల్లో వెలుగు రావాలంటే సీపీఎం పార్టీకి అండగా ఉండాలన్నారు. ఈసమావేశంలో నాయకులు మక్క బుచ్చిరాములు, లింగయ్య, శ్రీను, సత్యనారాయణ, అనంతరం నూతన కార్యదర్శిగా అన్నెబోయిన కిరణ్,సహాయ కార్యదర్శిగా బుర్రె సత్తయ్యలను ఎన్నుకున్నారు

నల్గొండ

• నల్గొండ • మునుగోడు • నకిరేకల్

ద్విచక్రవాహనం చోరీ

నకిరేకల్: నకిరేకల్ పుర పరిధి పటేల్‌నగర్‌లో ద్విచక్రవాహనం చోరీకి గురైంది. రోజు మాదిరిగానే తమ ఇంటి ఆవరణలో ద్విచక్రవాహనాన్ని ఆదివారం రాత్రి నిలిపిఉంచానని, సోమవారం ఉదయం వాహనం చోరీకి గురైందని బాధితుడు గడుసు కోటిరెడ్డి తెలిపారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారని వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80085 52710, 80085 66199, 8008574421, 80085 74385

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:

? పట్టణంలోని గొల్లగూడలో మురుగు కాల్వలు పేరుకు పోయాయి. దుర్వాసన వ్యాపిస్తోంది. శుభ్రం చేయించాలి.
– సుశీలమ్మ, నల్గొండ.

✔ పరిశీలించి కాల్వలు శుభ్రం చేయిస్తాం.
– నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టరు నల్గొండ పురపాలిక.

ప్రహరీ కూల్చి.. వాహనాలు అడ్డుగా నిలిపి



మండల పరిషత్ కార్యాలయ ప్రహరీని ఇలా.. కూల్చివేశారు

నకిరేకల్, న్యూస్‌టుడే: నకిరేకల్ మండల పరిషత్ ఆవరణలో పది ప్రభుత్వ కార్యాలయాలున్నాయి. వీటి చుట్టూ ఉన్న ప్రహరీని శివాజీనగర్ వైపు ఇటీవల గుర్తు తెలియని వారు పెద్దవాహనాలు వచ్చిపోయేందుకు వీలుగా కొంత భాగం అక్రమంగా కూల్చి వేశారు. శివాజీనగర్- మూసీ రోడ్డు మధ్య మండల పరిషత్ మధ్య నుంచే దారి ఏర్పడింది. కొందరు ప్రైవేట్ కార్లు, వ్యాన్లు, ట్రాక్టర్లు, ట్రాలీలను కార్యాలయాలకు అడ్డంగా గంటల తరబడి నిలుపుతున్నారు. తాము కార్యాలయాలకు ఎలా వెళ్లాలని, తమ వాహనాలు ఎక్కడ నిలపాలని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. ప్రహరీని మరో చోట అక్రమంగా కూల్చివేసి ఒక వ్యక్తి గృహనిర్మాణ సామాగ్రిని మండల పరిషత్ ఆవరణలోనే నిల్వచేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. క్రమంగా ఈ ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు స్వార్థపరులు యత్నిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అధికారులు స్పందించి మండల పరిషత్ స్థలం చుట్టు పటిష్టంగా ప్రహరీని నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



అడ్డంగా ప్రైవేట్ వాహనాల పార్కింగ్

చర్యలు తీసుకుంటాం..

– చంద్రశేఖర్, ఎంపీడీవో, నకిరేకల్

మండల పరిషత్ ప్రహరీని కొంత భాగం కూల్చివేసిన విషయం తమ దృష్టికి వచ్చింది, ఉన్నతాధికారులతో చర్చించి గోడను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం.

అలుగు పోస్తే.. ఊరు జలదిగ్బంధమే

కనగల్, న్యూస్‌టుడే: వర్షాకాలం వచ్చిందంటే చాలు ఆ గ్రామం జల దిగ్బంధంలో చిక్కుకుంటోంది. చెరువు నిండి అలుగు పారినా.. భారీ వర్షాలు కురిసి వరద నీరు పోటెత్తినా.. గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతూ.. పాలకులకు మొర పెట్టుకున్నా .. హామీలు తప్ప అమలు శూన్యంగానే మిగులుతోంది. మండలంలోని కురంపల్లి వాసులు వానాకాలం వచ్చిందంటే నానా అవస్థలు పడుతున్నారు. ఊరు పైనే చెరువు ఉండటంతో దాని అలుగు గ్రామంలోకి ఏర్పాటు చేయడంతో చెరువు నిండి అలుగు పారినా.. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు పోటెత్తినా కురంపల్లి జలదిగ్బంధంలో చిక్కుకునట్లే. గ్రామంలో వేసిన రహదారులు కోతకు గురై నడవడానికి కూడా వీలులేకుండా ఉంది. భారీగా వరద వస్తే రేగట్టే- కురంపల్లి, చండూరు- కనగల్ మధ్యల రాకపోకలు నిలిచిపోతాయి. అలుగు నీరు ఇళ్ల మధ్య నుంచి వెళుతుండటంతో ఇళ్లు దెబ్బతింటున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. గత ఇరువై ఏళ్లుగా అలుగును రేగట్టే వైపు ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులకు విన్నపాలు చేసిన అది ఎన్నికల వాగ్దానంగానే మిగిలి పోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి కురంపల్లి చెరువు అలుగును రేగట్టే వాగు వైపు ఏర్పాటు చేసే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



గ్రామం నుంచి పారుతున్న అలుగు నీరు(పాత చిత్రం)

ఇళ్లు కూలుతున్నాయి.. – తిలక్‌చారి, కురంపల్లి

వర్షాకాలం వచ్చిందంటే చెరువు మత్తడి అలుగు పోస్తుండటంతో ఆనీరు మొత్తం గ్రామంలోకి వస్తుండటంతో ఇళ్ల పునాదులు దెబ్బతింటున్నాయి, రోడ్లు కోతకుగురై నడవడానికి వీలు లేకుండా తయారవుతున్నాయి. వరద ఎక్కువగా వస్తూ రేగట్టే -కురంపల్లి, కనగల్-చండూరుకు రాకపోకలు నిలిచిపోతాయి. అధికారులు స్పందించి అలుగు నీరు గ్రామంలోకి రాకుండా రేగట్టే వాగు వైపు మళ్లించాలి. అప్పుడే సమస్య పరిష్కారం అవుతుంది.

క్రీడల్లోనూ రాణించాలి: డీఈవో

నల్గొండ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని డీఈవో భిక్షపతి పేర్కొన్నారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నల్గొండ మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన అండర్-14,17 బాలబాలికల జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడల ద్వారా మానసిక వికాసం లభిస్తుందని తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో రాణించేలా తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్యాలు ప్రోత్సహించాలని కోరారు. క్రీడల్లో రాణించే వారు అన్ని రంగాల్లో ముందుంటారని తెలిపారు. అనంతరం నిర్వహించిన క్రికెట్ పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడా జట్లు త్వరలో యాదాద్రి, సూర్యాపేట జిల్లాలో జరిగే ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వాసుదేవరావు, రమేశ్‌రెడ్డి, నాగరాజు, విజయ్‌పాల్, అలీం, కరుణాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

విద్యార్థుల శ్రమదానం

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: నల్గొండ నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పురపాలికశాఖ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో స్వచ్ఛహి సేవా కార్యక్రమంను నిర్వహించారు. విద్యార్థులు స్థానిక రైతుబజార్, క్లాకటవర్ తదితర ప్రాంతాల్లో చెత్తను సేకరించి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంజీయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ పి.మద్దిలేటి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవను అలవర్చుకోవాలని కోరారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా భావించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్జీ కళాశాల ప్రిన్సిపల్ ఉపేందర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు వెంకట్‌రెడ్డి, కోటయ్య, శివరాణి, మల్లేశం, అనిల్‌కుమార్, సావిత్రి, పీఆర్వో వెల్దండి శ్రీధర్, హరి, పాల్గొన్నారు.



నల్గొండ రైతుబజార్‌లో చెత్త సేకరిస్తున్న విద్యార్థులు

చర్యలు తీసుకోవాలని ధర్నా

నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: తిరుపతి వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాద విషయంలో జరిగిన అపచార, అపవిత్రతకు వ్యతిరేకంగా విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. పరిషత్ ప్రాంత ఉపాధ్యక్షుడు మోహన్ రావు మాట్లాడుతూ దేవాదాయ ధర్మాదాయశాఖను రద్దు చేసి దేవాలయాలన్నీ హిందూ ధార్మిక సంస్థల పరిధిలోకి తెచ్చి ఆలయాల ఆస్తులు, పవిత్రతను కాపాడాలన్నారు. తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిపినందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఉమాకర్‌రెడ్డి, గంజి సొధాకర్, జకురి సంపత్ వర్మ, భాజాపా జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి, భజరంగ్‌దళ్ ప్రతినిధులు కన్నెబోయిన వెంకట్, వంశీతో పాటు వివిధ హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న హిందూ సంఘాల ప్రతినిధులు

భక్తుల శాంతి ప్రదర్శన



నకిరేకల్: శాంతి ప్రదర్శనలో భక్తులు, వివిధ ఆలయ కమిటీల ప్రతినిధులు

నకిరేకల్, న్యూస్‌టుడే: తిరుపతి శ్రీవేంకటేశ్వస్వామివారి లడ్డూ ప్రసాదంలో కల్తీనెయ్యి వినియోగించి మనోభావాలను దెబ్బతీశారని నిరసిస్తు నకిరేకల్‌లో భక్తులు, హిందూ ధార్మిక సంస్థలు, హిందూ బంధువులు, ఆలయ కమిటీల ప్రతినిధులు సోమవారం శాంతి ప్రదర్శన నిర్వహించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రదర్శనలో నకిరేకల్ పుర ఇన్‌ఛార్జి ఛైర్‌పర్సన్ మురారిశెట్టి ఉమారాణి, వివిధ ఆలయ కమిటీల ఛైర్మన్లు బ్రహ్మదేవర పద్మావతి, వనమా వెంకటేశ్వర్లు, ఉప్పల రమేశ్, కోటగిరి శ్రీనివాస్, పబ్బతి వెంకన్న, గుండా వెంకటయ్య, జొర్రీగల శ్రీనివాస్ పాల్గొన్నారు. తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి యాతాకుల అంజయ్య సంఘీభావం తెలిపారు.

జోరుగా.. హుషారుగా

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: నల్గొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల బీఏ విద్యార్థుల స్వాగతోత్సవం సోమవారం ఆ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఆటపాటలతో స్వాగతం పలికారు. ఎన్జీ కళాశాల ప్రిన్సిపల్ ఉపేందర్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను ఏర్పరుచుకుని చదవాలని కోరారు. ప్రతి విద్యార్థి కళాశాలలో చేరిన నాటి నుంచే ప్రణాళికతో చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరాజు, అధ్యాపకులు కె.శ్రీనివాస్, వెంకటకృష్ణ, రామిరెడ్డి, ఉప్పలయ్య, పావని, పాల్గొన్నారు.



స్వాగతోత్సవంలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

సమాజ సేవతో సంతృప్తి: ఏఎస్పీ



వాటర్ ట్యాంకును ప్రారంభిస్తున్న ఏఎస్పీ రాములునాయక్, తదితరులు

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ ఆధ్వర్యంలో ఎల్‌వీ సేవా వేదిక వారి సహకారంతో నల్గొండలోని ప్రభుత్వ బాలికల కళాశాలకు రూ.25 వేల విలువ గల స్టీల్ వాటర్ ట్యాంక్‌ను సోమవారం బహూకరించారు. జిల్లా అడిషనల్ ఎస్పీ రాములునాయక్ మాట్లాడుతూ సమాజ సేవతో సంతృప్తి లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వ కళాశాలల అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సుధారాణి, క్లబ్ ప్రతినిధులు గోలి అమరేందర్‌రెడ్డి, కేవీ.ప్రసాద్, ఎల్విక్‌కుమార్, అశోక్‌రెడ్డి, నర్సిరెడ్డి, పిచ్చయ్య, శంకర్‌రెడ్డి, సతీష్‌కుమార్, రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

కట్టంగూరు, న్యూస్‌టుడే: హ్యాండ్‌బాల్ ఉమ్మడి జిల్లా సీనియర్ జట్ల ఎంపికను చెర్వుఅన్నారం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 150 మంది క్రీడాకారులకు నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపిన వారిని పురుషుల, మహిళల జట్లకు ఎంపిక చేశామని అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య చెప్పారు. ఎంపికైన క్రీడాకారులను ఎంఈవో అంబటి అంజయ్య, పాఠశాల హెచ్ఎం.కె.రమా అభినందించారు.



ఎంపికైన జిల్లా జట్లతో ఎంఈవో అంజయ్య, హెచ్ఎం రమా, అసోసియేషన్ కార్యదర్శి పుల్లయ్య

డీలర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వ చౌకధర దుకాణ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందచేశారు. డీలర్లకు గౌరవ వేతనం ప్రకటించాలని కోరారు. క్వింటాల్‌కు రూ. 300 కమిషన్ చెల్లించాలని వివరించారు. ఎంఎల్ఎస్ పాయింట్లలో ఎలక్ట్రానిక్ ప్రింటెడ్ వే బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని కోరారు. రూ. 10 లక్షల బీమా అమలు చేసి ఆరోగ్య కార్డులు అందచేయాలని తెలిపారు. దిగుమతి హమాలి ప్రభుత్వమే భరించాలని పేర్కొన్నారు. ఒక శాతం తరుగు ఇవ్వాలని, ప్రతి నెల ఈ పాస్ నుంచి తొలగించాలని కోరారు. రేషన్ దుకాణం నిర్వహణకు ప్రభుత్వ స్థలం కేటాయించాలని వివరించారు. రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి నాగరాజు, కోటగిరి సూర్యనారాయణ, వైద్యుల సత్యనారాయణ, విజయ్‌కుమార్, శ్రీనివాస్, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో సత్తాచాటిన చిన్నారులు

చండూరు, న్యూస్‌టుడే: ఈనెల 29న నిర్మల్‌లో నిర్వహించిన చుక్క ధర్మరాజు నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ అండర్-14 విభాగంలో చండూరుకి చెందిన ఎస్ఎస్ కరాటే జిమ్నాస్టిక్ అకాడమీ చిన్నారులు 10 మంది పతకాలు సాధించారు. ఐశ్వర్య, పోకూరి సహస్ర, చక్రధర్, శ్రీనిధి, విష్ణు, గోపిలత, శ్రీజన్, జోకాంత్‌రెడ్డి, నిశాంత్‌రెడ్డి, అనాస్‌లు గెలుపొందగా టోర్నమెంట్ ముఖ్య న్యాయ నిర్ణేత సెన్సాయ్ రాహుల్ సుదర్శన్ పతకాలు అందజేశారు.



చిన్నారులకు పతకాలు అందజేస్తున్న పోటీల నిర్వాహకులు

అవీ ఇవీ

సేవలకు గుర్తింపు

చిట్యాల: విశ్రాంత ఉద్యోగులు తమ శేషజీవితాన్ని సమాజసేవకోసం కేటాయించాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు డీవీఎస్ ఫణికుమార్ పేర్కొన్నారు. చిట్యాలలో జడ్పీఉన్నత పాఠశాల హెచ్ఎం కె.కరుణాకర్‌రెడ్డి ఉద్యోగ విరమణను పురస్కరించుకుని సోమవారం ఏర్పాటుచేసిన వీడ్కోలు కార్యక్రమానికి ఫణికుమార్ హాజరయ్యారు. కరుణాకర్‌రెడ్డి దంపతులను సన్మానించారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల జానారెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు సుంకరి భిక్షంగౌడ్, మండలాధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె.సుధాకర్‌రెడ్డి, కె.శ్రీనివాసరెడ్డి, గౌరవాధ్యక్షుడు బాదం భిక్షపతి, ఇన్‌ఛార్జి హెచ్ఎం జి.మాధవి పాల్గొన్నారు.

వీడ్కోలు సన్మానం.. నకిరేకల్: ఓగోడు ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కొల్లు సైదయ్య ఉద్యోగ విరమణ వీడ్కోలు సన్మాన సభను పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించారు. నకిరేకల్, శాలిగౌరారం ఎంఈవోలు ఎం.నాగయ్య, సైదులు, జడ్పీ పాఠశాల హెచ్ఎం పి.గోపాల్, పీఆర్టీయూటీఎస్ మండల అధ్యక్షుడు వంటల ఆనంద్‌బాబు, కల్లుగీత సొసైటీ ఛైర్మన్ కొండ జానయ్యగౌడ్, కౌన్సిలర్ కొండ శ్రీనుగౌడ్, ఐకేపీ సీసీ మట్టయ్యగౌడ్ తదితరులు కొల్లు సైదులును సన్మానించారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.. చిట్యాల: మండల పరిధిలో వరి, పత్తి కొనుగోలుకేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దారు కృష్ణకు సీపీఎం, రైతుసంఘాల నాయకులు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేశ్, అవిశెట్టి శంకరయ్య, ఐతరాజు నరసింహ, లడేరాములు, రూపని ఇద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పరిశీలన.. చిట్యాల: చిట్యాల జడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి కొమ్ము శ్రీనివాస్, ఏఎంవో రామచంద్రయ్య సోమవారం విద్యార్థుల అభ్యసన, సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల్లో మార్పులు తీసుకు రావడానికి ఇలాంటి సర్వే కార్యక్రమాలు దోహదపడతాయని వారు పేర్కొన్నారు. వారి వెంట ఎంఈవో పి.సైదానాయక్, హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి, అంబటి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి.. నల్గొండ జిల్లా పరిషత్తు: కార్మికుల ఆరోగ్య సంక్షేమం కోసం వైద్యశిబిరాలు ఏర్పాటు చేశామని మున్సిపల్ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్గొండలో ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పుర కమిషనర్ ముసాబ్ అహ్మద్ సయ్యద్ పాల్గొన్నారు.

జిల్లా కమిటీలో చోటు.. నకిరేకల్: నకిరేకల్‌కు చెందిన వంటల వెంకటేశ్వర్లు, బి.రమణారావు, జి.రవిశంకర్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా, శ్రీపాది నాగేంద్రప్రసాద్, లోట్లపల్లి కోటయ్య, ఎం.డి అబ్దుల్ రెహమాన్, కొండ లక్ష్మి జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారని మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వి.ఆనంద్‌బాబు, సీహెచ్.సుధాకర్ తెలిపారు.

వసతులు కల్పించాలి.. నకిరేకల్: ప్రభుత్వ వైద్యశాలల్లో వసతులు కల్పించి మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాళ ప్రమీల డిమాండ్ చేశారు. తాటికల్‌లో పార్టీ గ్రామశాఖ మహాసభలో మాట్లాడారు.తాటికల్ సీపీఎం కార్యదర్శిగా కారింగి యాదగిరి ఎన్నికయ్యారని ప్రకటించారు. కార్యదర్శి వెంకట్ గౌడ్ పాల్గొన్నారు.

ఎన్నిక.. నీలగిరి: చాకలి ఐలమ్మ మటన్ షాపుల అసోసియేషన్ కమిటీ సోమవారం రజక భవన్‌లో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా కట్లకుంట్ల శంకర్, వట్టికోటి శంకర్, కోశాధికారి కునుకుంట్ల వెంకన్న, ఉపాధ్యక్షులు పరమేశ్ ఎన్నికయ్యారు. సీఐటీయూ నాయకులు సైదులు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు.

ముగిసిన హిందీ పక్షోత్సవాలు.. నీలగిరి: భారత ఆహార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన హిందీ పక్షోత్సవాలు సోమవారం ముగిశాయి. ఉద్యోగులకు వ్యాసరచన, అనువాదం, డిక్టేషన్, క్విజ్, హిందీ టైపింగ్, అంత్యాక్షరి పోటీలు నిర్వహించారు. ఎఫ్‌సీఐ డివిజనల్ మేనేజర్ హీరాసింగ్ రావత్, కెఎన్‌కె ప్రసాద్, రఘుపతి, బిల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు.. నకిరేకల్: నకిరేకల్ పురపాలిక పరిధిలోని 6, 10, 17వ వార్డుల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాజుల సుకన్య సోమవారం ప్రారంభించారు. పుర కౌన్సిలర్లు మట్టిపల్లి కవిత, చౌగోని అఖిల, పన్నాల పావని పాల్గొన్నారు.

సేవలు మరువలేనివి.. చిట్యాల: గడ్డం అంజిరెడ్డి సేవలు మరువలేనివని సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు బొంతల చంద్రారెడ్డి పేర్కొన్నారు. వెలిమినేడులో ఆయన 18వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన స్మారక స్థూపం వద్ద నివాళి అర్పించారు.

డిండి డీపీఆర్‌ను ఆమోదించాలి: సీపీఎం.. మర్రిగూడ: డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను ఆమోదించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. శివన్నగూడెం లో నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు.

నిరుపేద కుటుంబానికి చేయూత.. నల్గొండ టౌన్: నల్గొండకు చెందిన వంటెపాక పరశురాములు అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు పడుతుండటంతో ఆశాజ్యోతి ఫౌండేషన్ న్యూ జెర్సీ వారు అతడి కుటుంబ సభ్యులకు మొత్తం రూ.30వేలు అందించారు.

అప్పుడే అంతరాలు లేని సమాజం: ఎమ్మెల్సీ



శివన్నగూడెం: పదవీ విరమణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

మర్రిగూడ, న్యూస్‌టుడే: అందరికీ ఒకే చోట ఒకే విద్య అందేలా చూస్తే అంతరాలు లేని సమాజం నిర్మితం అవుతుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని శివన్నగూడెం మండల ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు గ్రహీత జనార్దన్ పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బావి జీవితంలో విద్యా ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా పని చేయాలని ఆయనకు సూచించారు. మండల విద్యాధికారి బిట్టు శ్రీను, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, నర్సింహులు ఉన్నారు

విశ్రాంత జీవితంలోనూ గుర్తింపు పొందాలి: ఎస్పీ

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: పోలీస్‌శాఖలో పదవీ విరమణ పొందిన వారు విశ్రాంత జీవితంలో కూడా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. పోలీస్‌శాఖలో పనిచేస్తూ సోమవారం పదవీ విరమణ పొందిన సిబ్బందికి స్థానిక కార్యాలయంలో శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాములు నాయక్, ఎస్‌బీ డీఎస్పీ రమేశ్, ఏవో శ్రీనివాస్, పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జయరాజు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు: సీఐ

శాలిగౌరారం, న్యూస్‌టుడే: మండలంలోని పెర్కకొండారం. తుడిమిడిలో దసరా బంపర్ ఆఫర్ అంటూ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఈ రెండు గ్రామాల్లో రూ.200 కోట్ల కొట్టు మేకను పట్టు అంటూ దసరా ఆఫర్ అని పెడుతున్నారు. దీనిపై శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, ఎస్సై సైదులు స్పందించారు. ఇలాంటి ఆఫర్‌లను పెట్టి ప్రజలను మోసం చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మర్రిగూడ: పండుగ పేరు మీద చట్ట వ్యతిరేక స్కీములు నిర్వహిస్తే కఠిన చర్యలుంటాయని ఎస్సై రంగారెడ్డి అన్నారు. మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో దసరా సందర్భంగా కొంత మంది లాటరీ పేరుతో ప్రజలకు మోసం చేస్తూ అక్రమ పద్ధతిలో డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో వందకొట్టు మేకను పట్టు అని మభ్యపెడుతున్నారని అన్నారు. ఈ మేరకు సంబంధిత స్కీముల నిర్వాహకులను సోమవారం స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు.

డీఎస్సీలో ప్రతిభ



నకిరేకల్, న్యూస్‌టుడే: డీఎస్సీ ఫలితాల్లో నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామానికి చెందిన నిమ్మల భవాని ఎస్జీటీలో జిల్లా స్థాయిలో 41వ ర్యాంకు సాధించి ప్రతిభ చూపారు. ఇటీవల విడుదలైన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఫలితాల్లో యాదాద్రి జోన్ స్థాయిలో భవాని 24వ ర్యాంకు సాధించారు. ఆమె భర్త పుట్ట సైదులు రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం పాఠశాలలో స్కూల్‌అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. భవానిని స్థానికులు అభినందించారు.

తల్లిదండ్రుల కోరిక మేరకు



నార్కట్‌పల్లి గ్రామీణం: మాండ్రకు చెందిన కోటయ్య, అలివేలు రెండో కుమారుడు మాండ్ర శివప్రసాద్ డీఎస్సీ-2024 సెకండరీ గ్రేడ్ టీచర్ ఫలితాల్లో 80.6 మార్కులతో జిల్లాలో 8వ ర్యాంకు సాధించాడు. అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి వరకు, ఇంటర్ నల్గొండలోని ఓ ప్రైవేట్ కళాశాలలో, డిగ్రీ నిజాం కాలేజ్, పీజీ ఉస్మానియా యూనివర్సిటీ, బీఈడీ నల్గొండ ప్రభుత్వ కళాశాలలో పూర్తి చేశారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన శివప్రసాద్ ఉద్యోగం సాధించడం పట్ల తల్లిదండ్రులు, గ్రామస్థులు అభినందించారు. తనను ఉపాధ్యాయుడిగా చూడాలన్నది తల్లిదండ్రుల కోరిక అని వారు కన్న కలలు సాకారం చేయడానికి శ్రమించి ఉద్యోగం సాధించానన్నారు.

ఎస్జీటీలో 28వ ర్యాంకు



మర్రిగూడ, న్యూస్‌టుడే: మండల పరిధిలోని రాజపేట గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్, ఫాతిమా దంపతుల కుమారుడు కరీం ఎస్జీటీ విభాగంలో జిల్లా స్థాయి 28వ ర్యాంకును సాధించాడు. పేదరికంలో పుట్టి ఉత్తమ ర్యాంకు రావడం పట్ల తల్లిదండ్రులు, స్నేహితులు, పలువురు గ్రామస్థులు అతన్ని అభినందించారు.

మూడో ప్రయత్నం.. మూడో ర్యాంకు



మునుగోడు: రైతు కుటుంబంలో జన్మించి పట్టుదలతో చదివాడు. పదమూడేళ్ల కాలంలో మూడుసార్లు పరీక్షలు రాశాడు. ఇప్పుడు జిల్లాలోనే మూడో ర్యాంక్ సాధించి సత్తాచాటాడు. నల్గొండ జిల్లా మునుగోడు మండలం గంగోరిగూడెం గ్రామానికి చెందిన పానుగంటి కృష్ణయ్య - సొక్కమ్మ దంపతులకు చెందిన రాఘవేంద్రది వ్యవసాయ ఆధారిత కుటుంబం. సోమవారం విడుదలైన ఫలితాల్లో 79.57 మార్కులతో జీవశాస్త్రం విభాగంలో జిల్లా స్థాయిలో మూడో ర్యాంక్ సాధించాడు.

లండన్‌లో అంబేడ్కర్ మ్యూజియం సందర్శించిన వీరేశం

నకిరేకల్: పది రోజుల లండన్ పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే వేముల వీరేశం అక్కడ డా.బీఆర్ అంబేడ్కర్ మ్యూజియం(నివాస ప్రాంతం)ను సందర్శించారని కాంగ్రెస్ నాయకులు సోమవారం నకిరేకల్‌లో తెలిపారు. అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించి, వస్తువులను పరిశీలించారన్నారు.

నియామకం

నార్కట్‌పల్లి గ్రామీణం న్యూస్‌టుడే: ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కోఆర్డినేటర్‌గా నక్కలపల్లిలోని జడ్పీ ఉన్న పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న మారోజు ఉమ నియమితులయ్యారు.

యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

కనగల్,న్యూస్‌టుడే: టీఎస్ యూటీఎఫ్ మండల కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సయీదుద్దీన్ అహ్మద్ (కుమ్మరిగూడెం), ప్రధాన కార్యదర్శిగా అనుముల రవీందర్‌బాబు(బోయినపల్లి), మహిళ ఉపాధ్యక్షురాలిగా కె.పుష్పలత(కురంపల్లి) ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, పగిళ్ల సైదులు దాసరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

తిప్పర్తి, న్యూస్‌టుడే: తిప్పర్తి ఎస్సైగా బి.సాయిప్రశాంత్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై డి.రాజు పదోన్నతిపై నల్గొండ ట్రాఫిక్ సీఐగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో సూర్యాపేట జిల్లా సీసీఎస్‌లో పనిచేస్తున్న సాయిప్రశాంత్‌ను ఉన్నతాధికారులు తిప్పర్తి ఠాణాకు బదిలీ చేశారు. సీఐ రాజు నుంచి తిప్పర్తి మండల ఎస్సైగా బాధ్యతలు తీసుకున్నారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి

చండూరు, న్యూస్‌టుడే: ఆంక్షలు లేకుండా రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ కాకపోవడం వల్ల చాలా మంది రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు భరోసా డబ్బులు అన్నదాతల ఖాతాలో జమచేయాలని కోరారు. పార్టీ మండల కార్యదర్శి నలపరాజు సతీష్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు అంజాచారి పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ

మునుగోడు: మునుగోడు పీహెచ్‌సీని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని సిబ్బంది తప్పనిసరిగా సమయ వేళలను పాటిస్తూ సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ల్యాబ్‌లో ఇటీవల చేసిన డెంగీ, మలేరియా పరీక్షల ఫలితాలను అడిగి తెలుసుకున్నారు. హోమియోపతి వైద్యశాలను సందర్శించారు. వైద్యాధికారిణులు మాధురి, నర్మదా, స్ఫూర్తి ఉన్నారు.

సినిమాలు

నల్గొండ కల్చరల్, నకిరేకల్, న్యూస్‌టుడే

నల్గొండ: **నటరాజ్:** దేవర, **తిరుమల:** సత్యం సుందరం, **వెంకటేశ్వర:** మత్తు వదలరా 2

నకిరేకల్: **రామకృష్ణ-** సత్యం సుందరం, **వెంకటేశ్వర-** దేవర

మిర్యాలగూడ

•మిర్యాలగూడ •నాగార్జునసాగర్ •దేవరకొండ

అమరుల ఆశయ సాధనకు కృషి చేయండి

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: అమరుల ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఐలాపురం గ్రామానికి చెందిన దీప్లానాయక్ అనారోగ్యంతో బాధపడుతూ.. సోమవారం మృతిచెందగా పార్టీ నాయకులతో కలసి మృతదేహాన్ని సందర్శించి పార్టీ జెండా కప్పి, పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మల్లేశ్, జిల్లా కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, రవినాయక్, గౌతంరెడ్డి, మంగారెడ్డి, రామ్మూర్తి, హనుమానాయక్, పాల్గొన్నారు.

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని హనుమాన్‌పేట పై వంతెన కింద రోడ్డు మొత్తం గుంతలు పడి అధ్వానంగా మారింది. – ఏడుకొండలు, మిర్యాలగూడ

✔ గుంతలు పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం. – ఎండీ యూసుఫ్, పుర కమిషనర్, మిర్యాలగూడ

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 77994 92939 99121 74975 98487 81656

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని సంతోష్‌నగర్‌లో గంధం సైదులు ఇంటి సమీపంలో గత రెండు నెలలుగా పక్క కాల్వల్లో వ్యర్థాలు తొలగించకపోవడంతో అనేక అవస్థలు పడుతున్నాం. – సత్య, మిర్యాలగూడ

✔ వ్యర్థాలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. – ఎండీ యూసుఫ్, పుర కమిషనర్, మిర్యాలగూడ

దేవరకొండ, న్యూస్‌టుడే:

? దేవరకొండ ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం టీవీలు ఏర్పాటు చేయాలి. రెండు టీవీలు ఉన్నా మరమ్మతులకు నోచుకోవటం లేదు. – ఆర్.జగదీష్, దేవరకొండ

✔ టీవీల మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.. – రమేష్, ఆర్టీసీ డీఎం

అన్నదమ్ములు అనుకున్నది సాధించారు!



చిన్నపాక రాకేష్, రితీష్

ప్రభుత్వ బడిలో కష్టపడి చదివారు.. ఆత్మవిశ్వాసం తోడు కావటంతో అనుకున్నది సాధించారు పెద్దవూర మండలానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు చిన్నపాక రాకేష్, చిన్నపాక రితీష్. మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన చిన్నపాక లక్ష్మీనారాయణ, మంజుల దంపతుల కుమారులు వీరు. ఆరో తరగతి నుంచి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్‌లో చదివి 2024-25 నీట్ పరీక్షల్లో ఆలిండియా కేటగిరిలో 16వేల లోపు ర్యాంకు, రాష్ట్రస్థాయి కేటగిరి 500 లోపు ర్యాంకు సాధించటంతో రాకేష్ జగిత్యాలలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో, రితీష్ మహబూబాబాద్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. పేద దళిత కుటుంబంలో జన్మించి కష్టపడి చదివి ఒక పర్యాయం నీట్ సాధించడంతో ఆ కుటుంబం ఆనందంలో మునిగిపోయింది. ఎన్ని అవరోధాలు ఎదురైనా పట్టుదలతో ప్రణాళికబద్ధంగా చదివితే ఎంతటి విజయాన్ని అయినా సాధించవచ్చని వీరు రుజువు చేశారు. – న్యూస్‌టుడే, పెద్దవూర

సమస్యలకు నిలయంగా ముదిమాణిక్యం పాఠశాల

అడవిదేవులపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని ముదిమాణిక్యం ప్రాథమిక పాఠశాల సమస్యల వలయంలో చిక్కుకుని విలవిలలాడుతోంది. మండల పరిధిలో కృష్ణాపాతి ఒడ్డున ఉన్న ఈ గ్రామంలోని పాఠశాలలో 25 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా.. పాఠశాలలో కనీస వసతులు లేవు. తాగునీటి మంచినీటి సౌకర్యంలేక విద్యార్థులు నీటి సీసాలతో ఇంటి వద్ద నుంచి తాగు నీరు తెచ్చుకుంటున్నారు. శౌచాలయాల్లో నీటి సౌకర్యం లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. తాగునీటి కోసం ఏర్పాటుచేసిన నల్లాలు అలంకారప్రాయంగానే మారాయి. వంటగదికి తలుపులు లేవు. ఏళ్ల క్రితం పాఠశాల ఆవరణలో నిర్మించిన నీటిశుద్ధి కేంద్రం నిరుపయోగంగా మారింది. దాన్ని తొలగిస్తే పాఠశాల విద్యార్థులకు ఆడుకునేందుకు సౌకర్యంగా ఉంటుందని ఉపాధ్యాయులు, స్థానికులు అంటున్నారు.


నిరుపయోగంగా నీటిశుద్ధి కేంద్రం


ముదిమాణిక్యం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నభోజనం చేస్తున్న విద్యార్థులు

వేతనం పెంచాలి..

– వీరబోయిన ఎలమంచమ్మ, వంటమనిషి, ప్రాథమిక పాఠశాల, ముదిమాణిక్యం

ప్రభుత్వం అందజేస్తున్న గౌరవ వేతనం సకాలంలో అందడంలేదు. బయట కూలికిపోతే రోజుకు రూ.250 వస్తోంది. మార్కెట్‌లో గుడ్డు ధర రూ.ఏడు పలుకుతోంది. కూరగాయలు, పప్పులు, నూనెల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కట్టెల పొయ్యితో అనారోగ్యం పాలవుతున్నాను. గౌరవ వేతనం, సరైన సదుపాయాలు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

– వరలక్ష్మి, మండల విద్యాధికారి అడవిదేవులపల్లి

మండల పరిధిలోని ముదిమాణిక్యం ప్రాథమిక పాఠశాలను పరిశీలించి.. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటాను.

చిత్రలేఖనంలో అదరగొట్టారు..!

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: హైదరాబాద్‌కు చెందిన సద్గురు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ కాన్వాస్ పెయింటింగ్ పోటీల్లో మిర్యాలగూడలోని విజయ డ్రాయింగ్ క్లాసెస్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు శిక్షకుడు ఇనుగుర్తి విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానికంగా మాట్లాడుతూ.. రిత్విక్‌రెడ్డి, ఆద్య, ఆర్య వేసిన గణపతి చిత్రాలతో పాటు తనకు సైతం విశ్వగురు వరల్డ్ రికార్డు అవార్డులు లభించినట్లు తెలిపారు. తమకు ఎంపీ ఈటల రాజేందర్‌తో పాటు నిర్వాహకులు బహుమతులు అందజేశారన్నారు.


హైదరాబాద్‌లో ఎంపీ ఈటల రాజేందర్ చేతుల మీదుగా అవార్డులు స్వీకరిస్తున్న చిన్నారులు

కష్టపడ్డారు... ర్యాంకులు కొట్టారు



హాలియా: ఇటీవల ప్రకటించిన డీఎస్సీ 2024 ఫలితాల్లో హాలియాకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు మేకల కొండయ్య, సుబ్బరత్నమ్మల కుమార్తె **మేకల ప్రశాంతి** ఎస్జీటీ పోస్ట్‌లో 82.47 మార్కులతో జిల్లా స్థాయిలో 6వ ర్యాంకు సాధించారు. పాఠశాల విద్య స్థానిక నిర్మల స్కూల్, ఇంటర్, డిగ్రీ (బీఎస్సీ) స్థానిక ఆల్ఫా కళాశాలలో పూర్తి చేశారు. తాను ఆరో తరగతి చదువుతుండగా తల్లి చనిపోవడంతో తండ్రి ప్రోత్సాహంతో విద్యాభ్యాసం కొనసాగించారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్నది చిన్ననాటి కల కావటంతో 2018లో డీఎస్సీకి రాయగా మూడు మార్కులతో ఉద్యోగాన్ని కోల్పోయారు. 2021లో తన మేనమామ రాజశేఖర్‌తో వివాహం అయినా తను అనుకున్న లక్ష్యాన్ని మాత్రం విడవలేదు. తండ్రి, భర్త సహకారంతో 2024 డీఎస్సీలో ఉద్యోగం సాధించాలన్న తపనకు తన కృషి ఫలించింది.



దామరచర్ల: డీఎస్సీ 2024 ఫలితాలు స్కూల్‌అసిస్టెంట్ సోషల్ స్టడీస్ సబ్జెక్ట్‌లో మండలంలోని నర్సాపురం గ్రామానికి చెందిన **భూక్యా నాగేశ్వరరావు** జిల్లా స్థాయిలో ఎస్టీ కేటగిరిలో ప్రథమ ర్యాంకు, జనరల్ కేటగిరిలో 41వ ర్యాంకు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ 2018 డీఎస్సీలో కొంచెం మార్కుల తేడాతో ఉద్యోగం సాధించలేకపోయినా.. నిరాశకు లోనుకాకుండా పట్టుదలతో శ్రమించి లక్ష్యాన్ని చేరుకున్నారు. తల్లిదండ్రులు సైదానాయక్, నాజీబాయి, భార్య రమ్య, స్నేహితుల ప్రోత్సాహం తనకు ఉందని.. భవిష్యత్తులో గ్రూప్-2 సాధన తన లక్ష్యమని ఆయన వెల్లడించారు.



పెద్దఅడిశర్లపల్లి: పీఏపల్లి మండల కేంద్రానికి చెందిన **జానపాటి యల్లేష్.** తల్లిదండ్రులది వ్యవసాయ కుటుంబ చిన్నతనంలోనే తల్లి దూరమైనా కష్టాలు వెంటాడినా పట్టుదలతో చదివి సోమవారం వెలువరించిన డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీ విభాగంలో 80 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో 14వ ర్యాంకు సాధించారు. స్థానిక ప్రగతి ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు, హాలియా సృజన జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, చిలకమర్రి స్టేజీ సంజీవని డీఎడ్ కళాశాలలో డీఎడ్ పూర్తిచేశారు.



త్రిపురారం: మండలంలోని రాగడప తాజా మాజీ సర్పంచి **రేవూరి వెన్నెల** డీఎస్సీ ఫలితాల్లో ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలిగా జిల్లా స్థాయిలో పదో ర్యాంకు సాధించారు. గ్రామ సర్పంచిగా పని చేస్తూనే శిక్షణ పొందుతూ డీఎస్సీ ఫలితాల్లో ర్యాంకు సాధించడం ఆనందంగా ఉందన్నారు.



నిడమనూరు: నిడమనూరు మండల కేంద్రానికి చెందిన నాగిళ్ల సత్యం, అన్నపూర్ణ దంపతుల రెండో కుమారుడైన **నాగిళ్ల శివప్రసాద్** డీఎస్సీ ఫలితాల్లో 78.67 మార్కులు సాధించి, నల్గొండ జిల్లా స్థాయిలో 53వ ర్యాంకు సాధించారు. దాదాపు మూడేళ్లు కష్టపడి చదివి ర్యాంకు సాధించినందుకు శివప్రసాద్‌తో పాటు అతని తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

వైభవంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు


బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: మిర్యాలగూడలోని పలు పాఠశాలల్లో సోమవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆదిత్య పాఠశాలలో నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎల్ఆర్.. విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడి వారిలో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బతుకమ్మలోని రంగురంగుల పూలలాగే విద్యార్థులంతా కులమతాలకు అతీతంగా కలిసి మెలిసి ఉండాలన్నారు. ★ పట్టణంలోని అభ్యాస్ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులు బతుకమ్మలతో వచ్చి సాంప్రదాయ పాటలకు నృత్యాలు చేస్తూ అలరించారు. పలువురు విద్యార్థులు వివిధ దేవతామూర్తుల వేషధారణలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అభ్యాస్ విద్యా సంస్థల ఛైర్మన్ నిరంజన్‌రెడ్డి, పుష్పలత,శ్వేత పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ


దరఖాస్తులు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆయా విభాగాల డివిజన్ స్థాయి అధికారులు ప్రజావాణికి హాజరుకాగా కొన్ని సమస్యలను అక్కడికక్కడే లోతుగా విచారించటంతో పాటు సంబంధిత విభాగాల వారికి నివేదికలు అందజేయాలని ఆదేశించారు. ప్రజావాణి సందర్భంగా డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి రెవెన్యూకు సంబంధించి ప్రధానంగా వినతులు వచ్చాయి. మిర్యాలగూడ పట్టణంలోని తాళ్లగడ్డలో మల్లెతోట ఆక్రమణ, ఆంజనేయస్వామి ఆలయం ఎదుట అనధికారికంగా వెంచర్ ఏర్పాటుపై సబ్ కలెక్టర్‌కు స్థానికులు వినతిపత్రం అందజేశారు. మొత్తం 17 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో తహసీల్దారు హరిబాబు, దేశ్య పాల్గొన్నారు.

చింతపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని శివాలయ సమీపంలో ప్రమాదకరంగా మారిన విద్యుత్తు స్తంభాలను మార్చాలని స్థానికులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వెన్నం శేఖర్, నరేష్, శ్రీనివాస్, పుల్లయ్య, రవికుమార్ పాల్గొన్నారు.

4 దరఖాస్తులు..40 మంది అధికారులు

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: చదువు చారెడు..బలపాలు దోసెడు అన్నట్లుగా ఉంది మండల కేంద్రంలో సోమవారం జరిగిన ప్రజాపాలన కార్యక్రమం పరిస్థితి. కార్యక్రమంలో మండలంలోని 26 గ్రామపంచాయతీలకు చెందిన కార్యదర్శులతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు కలిపి సుమారు 40మందికి పైగా పాల్గొనగా ప్రజల నుంచి నాలుగు దరఖాస్తులు మాత్రమే రావడం గమనార్హం. ప్రతి సోమవారం దరఖాస్తులు అంతంత మాత్రంగానే వస్తున్నాయని.. కానీ అధికారులు కార్యాలయాల్లో పనులు పక్కన పెట్టి ప్రజాపాలన కార్యక్రమానికి రాక తప్పడం లేదని పేరు చెప్పటానికి ఇష్టపడని ఓ మండల స్థాయి అధికారి న్యూస్‌టుడేకు తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

పూల వేట మొదలు..

దసరా వేడుకల్లో ముందుగా వచ్చే బతుకమ్మ పండగకు సర్వత్రా సందడి మొదలైంది. బుధవారం బతుకమ్మ కోసం గాను మహిళలు రంగురంగుల పూలను సేకరిస్తున్నారు. అద్దంకి-నార్కట్‌పల్లి రహదారి మధ్యలో విభాగినిపై ఉన్న మొక్కల పూలను సేకరిస్తున్నారు. రెండు రోజులపాటు మాత్రమే మన్నికగా ఉండే ఈ పూలను ముందుగానే తెంపి భద్రపరచుకుంటున్నారు. మిర్యాలగూడ పట్టణంలోని అద్దంకి రహదారిపై మొక్కల వద్దకు పూలకోసం సోమవారం ఉదయం మహిళలు వచ్చి కోసుకుని వెళ్లారు. – న్యూస్‌టుడే, మిర్యాలగూడ



క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ బీసీ గురుకుల విద్యార్థులు పలు క్రీడల్లో ప్రతిభ చూపి పలు బహుమతులను సాధించినట్లు ప్రిన్సిపల్ రాజశేఖర్ తెలిపారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ గతనెల 29న నల్గొండలోని మేకల అభినవ్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీలలో తమ పాఠశాలలకు చెందిన విద్యార్థులు అండర్-14, 18, 20 విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో బహుమతులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు సాధించిన బహుమతులను పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అందజేశారు. ఏటీపీ గాయత్రి, పీడీలు విజయ్, జ్యోతి, అరుణ్, పీఈటీ నరసింహ పాల్గొన్నారు.



ప్రిన్సిపల్ రాజశేఖర్‌తో బహుమతులు సాధించిన విద్యార్థులు

పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: నందికొండ పురపాలికలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ప్రభుత్వం పురపాలికల్లో నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవా (ఎస్‌హెచ్ఎస్-2024) కార్యక్రమంలో భాగంగా సఫాయి మిత్ర సురక్ష శివార్ ద్వారా సోమవారం నందికొండ పురపాలికలో పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కమిషనర్ శ్రీను మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. ఛైర్‌పర్సన్ అన్నపూర్ణ, వైస్ ఛైర్ పర్సన్ నాగరాణి, కౌన్సిలర్లు రామకృష్ణ, రమేష్‌జీ, మంగ్తానాయక్ పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

చింతపల్లి, న్యూస్‌టుడే: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వరి స్వామి దేవాలయంలో నిర్వహించే దుర్గామాత నవరాత్రి ఉత్సవాల కరపత్రాలను సోమవారం నిర్వాహకులు ఆవిష్కరించారు. ఈనెల 3 నుంచి 12 వరకు కనుల పండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆలయ కమిటీ ఛైర్మన్ కొమిరిశెట్టి వెంకటయ్య, రాములు రవీందర్, శేఖర్, ప్రదీప్, సత్యనారాయణ పాల్గొన్నారు.


చింతపల్లిలోని శివాలయంలో ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఆత్మీయ వీడ్కోలు


హాలియా: దామోదర్‌రెడ్డిని సన్మానిస్తున్న టీపీయూఎస్ నాయకులు

హాలియా, న్యూస్‌టుడే: తిరుమలగిరిసాగర్ మండలం రాజవరం జడ్పీహెచ్ఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగవిరమణ పొందిన ఉపాధ్యాయుడు కరుముల దామోదర్‌రెడ్డిని టీపీయూఎస్ సంఘం నాయకులు ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. సోమవారం హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల డీఈవో గుండా కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు సన్మానించారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రశిక్షణ కో కన్వీనర్, ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, సత్యనారాయణ రెడ్డి. సుధాకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, అక్కయ్యబాబు, శకుంతల పాల్గొన్నారు.

గుర్రంపోడు: మండలంలో 22 ఏళ్ల పాటు పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి అందరి మన్ననలు పొందిన వెంకటరెడ్డికి మండలపరిషత్తు సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు స్థానిక మండలపరిషత్తు కార్యాలయ సమావేశమందిరంలో ఏర్పాటైన సమావేశంలో సన్మానించగా, నాలుగేళ్లపాటు గుర్రంపోడులో ఎంఈవోగా పనిచేసి పెద్దవూర మండల బాధ్యతలు చేపట్టిన తరి రాములును పీఆర్‌టీయూ సన్మానించి సత్కరించింది. జడ్పీటీసీ మాజీ సభ్యుడు రవికుమార్, రైతుసమన్వయసమితి జిల్లా సభ్యుడు విజయేందర్ రెడ్డి, ఎంపీడీవో మంజుల, పీఆర్‌టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి నారాయణరెడ్డి, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు గౌస్ మొయినుద్దీన్, మధుసూదన్‌రెడ్డి, హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


గుర్రంపోడు: తరి రాములును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

స్వచ్ఛతలో పురపాలికను ప్రథమ స్థానంలో నిలపాలి

హాలియా, న్యూస్‌టుడే: హాలియా పురపాలికను స్వచ్ఛతలో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలపడానికి పారిశుద్ధ్య కార్మికులు కృషి చేయాలని పుర ఛైర్‌పర్సన్ యడవల్లి అనుపమరెడ్డి అన్నారు. సోమవారం ఆమె పుర కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛతా హీ సేవాలో పుర ప్రజలకు అవగాహన కలిగించాలని తెలిపారు. మండల విద్యాధికారి రామకృష్ణ, వైద్య సిబ్బంది తావు నాయక్, సైదులు, జావీద్, కౌన్సిలర్లు ప్రసాద్‌నాయక్, వెంకటయ్య, నరేందర్‌రెడ్డి, సైదులు, ఆంజనేయులు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం:ఎస్సై

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: పేద విద్యార్థుల ఉన్నతికి యూత్ ఫర్ సేవా సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని


సంస్థ సభ్యులతో ఎస్సై రాంమూర్తి, విద్యార్థులు

ఎస్సై రాంమూర్తి తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.నాగేశ్వరరావు, సంస్థ సభ్యులు గోపి, శ్రీనివాస్, శ్రీశైలం, శ్రీనివాస్‌యాదవ్, బాలాజి, శ్రీధర్, సైదులు, అంజయ్య, సైదా పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి విద్యార్థుల పాత్ర ముఖ్యం

హాలియా, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ రహిత సమాజం కోసం విద్యార్థులది ప్రముఖపాత్ర వహించాలని హాలియా డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ వి.యాదయ్య అన్నారు. సోమవారం ఆయన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాజు ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో చేపట్టిన అవగాహన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. కళాశాల నుంచి హాలియా ప్రధాన కూడలి వరకు అవగాహన ర్యాలీ చేపట్టారు. డాక్టర్ కాంతయ్య, క్రాంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ..

త్రిపురారం: మండల కేంద్రానికి చెందిన వేమవరపు సాయి, మేదరి శైలజ ఇటీవల ప్రమాదవశాత్తూ సాగర్ ఎడమకాల్వలో పడి మృతి చెందారు. సోమవారం మృతుల కుటుంబ సభ్యులను స్థానిక ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం జరగిన ప్రమాదం గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేదరి శైలజ కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మార్తి భరత్‌రెడ్డి కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయనను పరామర్శించారు.

జంకు మృతి బాధాకరం.. **పెద్దవూర:** పెద్దవూర మండల భారాస పార్టీ అధ్యక్షుడు జటావత్ రవినాయక్ తల్లి జటావత్ జంకు మృతి బాధాకరమని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. సోమవారం పెద్దవూర మండలం చింతపల్లితండాలో జటావత్ జంకు దశదిన కార్యక్రమంలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ రాష్ట్ర ఆప్కాబ్ ఛైర్మన్ విజేందర్‌రెడ్డి, ట్రైకర్ మాజీ ఛైర్మన్ రాంచందర్‌నాయక్, విష్ణువర్ధన్‌రావు, సుందర్‌రెడ్డి, లింగయ్య, పటేల్ రవి తదితరులున్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

దేవరకొండ, న్యూస్‌టుడే: భాజపాలోని ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూల వీరేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం దేవరకొండలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కార్యకర్తల సమావేశం జరిగింది. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేవరకొండ నియోజకవర్గంలో అత్యధిక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కేతావత్ లాలు, ఏ.టి.కృష్ణ, నరేందర్‌రెడ్డి, వెంకటేష్, కరుణాకర్, సైదులు తదితరులున్నారు.



దేవరకొండలో మాట్లాడుతున్న తూల వీరేందర్‌గౌడ్

అవీ ఇవీ

అభినందన.. మిర్యాలగూడ గ్రామీణం: మిర్యాలగూడ పట్టణంలోని రైస్ మిలర్స్ అసోసియేషన్ హాల్లో సుమన్ షోటాఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 22వ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామంలోని ఆదర్శపాఠశాలలో విద్యార్థులు స్వర్ణం, రజతం, కాంస్య పతకాలు సాధించారు. ఆ విద్యార్థులను, కరాటే మాస్టర్ పోతుగంటి శ్రీనివాస్‌ను అభినందించి శాలువాతో సన్మానించారు. ఉపాధ్యాయులు కోటేష్, వెంకటేష్, పీడీ సుశీల, విద్యార్థులు, పాల్గొన్నారు.

జాగ్రత్త.. గుర్రంపోడు: దసరా పండగ సందర్భంగా లాటరీల పేరుతో పెద్దఎత్తున మోసం చేసేవారు వస్తున్నారని జాగ్రత్తగా ఉండాలని గుర్రంపోడు ఎస్ఐ నారాయణరెడ్డి హెచ్చరించారు. రూ.51, 99, 100 కొట్టు మేకను పట్టు అని చెబుతూ అక్రమదందా చేస్తున్నారని గుర్తుచేశారు. ఇలాంటి లాటరీలను తెలంగాణ ప్రభుత్వం నిషేధించిందని చెప్పారు.

కొండమల్లేపల్లి : అక్రమ పద్ధతిలో నగదు సంపాదించాలనే దురాలోచనతో దసరా, దీపావళి పండుగలను ఆసరా చేసుకుని ప్రజల నుంచి నగదు దండుకునే విధంగా లాటరీలు, జూదం లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తే సదరు వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ధనుంజయ, ఎస్సై రాంమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పరిశీలన.. త్రిపురారం: మండలంలోని నీలాయిగూడెంలో పంట పొలాలను కంపసాగర్ కేవీకే, వ్యవసాయ పరిశోధనస్థానం శాస్త్రవేత్తలు లింగయ్య, చంద్రశేఖర్ పరిశీలించారు. ప్రస్తుతం వరి పొలాలకు ఆకు ముడత తీవ్రంగా ఉంది. నివారణకు లీటరు నీటికి 2గ్రా. కార్టాప్ హైడ్రోక్లోరైడ్‌ని పిచికారీ చేసుకోవాలని సూచించారు. రైతులు సైదులు, నాగరాజు, సోమయ్య, వాసులు పాల్గొన్నారు.

పదవీ విరమణ సన్మానం... దేవరకొండ: ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజమని దేవరకొండ ఎంపీడీవో నీలిమ తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో పదవీ విరమణ పొందిన సూపరింటెండెంట్ విక్టర్‌జోబ్‌ను కార్యాలయ ఉద్యోగులు సన్మానించారు. డిండి సూపరింటెండెంట్ ఎంఎస్ డానియల్, కార్యాలయ సిబ్బంది తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత... డిండి: మండల కేంద్రంలో ఇటీవల ఎడ్ల మాధవ్ అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం ట్రాక్టర్ల యూనియన్ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబ సభ్యులకు రూ. 10,500 ఆర్థికసాయం అందజేశారు. రాజేందర్‌రెడ్డి, బాలయ్య, వెంకటయ్య, సైదులు, కృష్ణయ్య, తిరుపతయ్యగౌడ్, నర్సింహ, వెంకటేష్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి... చింతపల్లి: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు రైతుబంధు, రైతుబీమా పథకాలను అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నారి ఐలయ్య డిమాండ్ చేశారు. సోమవారం పలు గ్రామాల్లో గ్రామశాఖల మహాసభల్లో మాట్లాడారు. ఆనంద్, రాములు, కృష్ణయ్య, శ్రీను పాల్గొన్నారు.

బెంచీలు బహూకరణ.. త్రిపురారం: మాజీ ఎంపీపీ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ధనావత్ మారు ధన్‌సింగ్‌నాయక్ సాయంతో రూ.లక్ష వ్యయం వెచ్చించి 50 బెంచీలను వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రి, తండాల్లో ఏర్పాటు చేశారు. బుచ్చిరెడ్డి, భాస్కర్‌నాయక్, జయరాంనాయక్, రవి, వెంకట్‌రెడ్డి, అనంతరెడ్డి, బాలకృష్ణ వెంకటేశ్వర్లు, చందు పాల్గొన్నారు.

రైతు నేస్తం పీఏసీఎస్.. మాడ్గులపల్లి: సకాలంలో రైతులకు ఎరువులు, విత్తనాలు అందిస్తూ.. రైతు నేస్తంగా పీఏసీఎస్ మారిందని వేములపల్లి పీఏసీఎస్ ఛైర్మన్ జడ రాములు యాదవ్ అన్నారు. వేములపల్లిలో నిర్వహించిన సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. పద్మ, ప్రకాశ్, మాదవరెడ్డి, పాపయ్య, ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.



బాధ్యతల స్వీకరణ... మిర్యాలగూడ గ్రామీణం: ఇటీవల జరిగిన ఎస్సై బదిలీల్లో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఒకటో పట్టణ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న **పి.లోకేష్ కుమార్‌ను** మిర్యాలగూడ గ్రామీణ పోలీసు స్టేషన్‌కు కేటాయించగా... కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు.



వేములపల్లి: వేములపల్లి ఎస్సైగా డి.వెంకటేశ్వర్లు బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న **డి.విజయ్‌కుమార్** నల్గొండ వీఆర్‌కు వెళ్లగా, సూర్యాపేటలో విధులు నిర్వహిస్తున్న డి.వెంకటేశ్వర్లు ఇక్కడికి బదిలీపై వచ్చారు.

తహసీల్దారు... కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి నూతన తహసీల్దార్‌గా అన్వర్‌హుస్సేన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన అనురాధ మూడు నెలల క్రితం బదిలీపై వెళ్లారు. అప్పటినుంచి డీటీ ప్రశాంత్ ఇన్‌ఛార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

సినిమాలు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే

రాఘవ: దేవర, **వెంకటేశ్వర:** దేవర, **శ్రీనివాస:** సత్యం సుందరం, **విట్రోస్:** మత్తు వదలరా-2, దేవర, సత్యం సుందరం

ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

నిడమనూరు, న్యూస్‌టుడే: మండలంలోని బొక్కమంతలపహాడ్‌లో ఆ గ్రామానికి చెందిన పుట్టా ప్రభాకర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుటుంబసభ్యులు, కాంగ్రెస్ నాయకులు యడవెల్లి రంగశాయిరెడ్డి ఆధ్వర్యంలో చెన్నైకు చెందిన శంకర్ నేత్రాలయ వారు గత శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శుక్రవారం వరకు కొనసాగే ఈ వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి సోమవారం సందర్శించారు. పరీక్షలు జరుగుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. సత్యం, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శివమారయ్య, మంజుల శ్రీను పాల్గొన్నారు.


పరీక్షల విధానాన్ని అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి